

ఓం నమో భగవతే శ్రీ రమణాయ

# రమణ భాస్కర




వ్యవస్థాపక సంపాదకులు : బి. వి. ఎల్. ఎన్. రాజు

సంపుటి : 28 సంచిక : 12 ఆగష్టు 2023



రమణ భాస్కర

ఆధ్యాత్మిక మాస పత్రిక

పేజీలు : 28

గౌరవ సంపాదకులు

శ్రీమతి P. H. V. సత్యవతి (హైమ)

చందా

సంవత్సర చందా:రూ॥ 150/-

విడి ప్రతి : రూ॥ 15/-

చిరునామా

రమణ భాస్కర

శ్రీ రమణ క్షేత్రం,

జిన్నూరు - 534 265

ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్

సద్గురు శ్రీ నాన్నగారు

శ్రీ రమణ క్షేత్రం

జిన్నూరు - 534 265

9441122622

7780639977

ప్రింటర్

శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్

(దుడే శ్రీను) ఎస్. వి. ఆర్. కాంప్లెక్స్,

పాలకొల్లు, 9848716747

డిజైనింగ్

అనన్య జిరాక్స్ & నెట్ సెంటర్

(నందిగామ శేషసాయి)

పి. పి. రోడ్డు, లజపతిరాయ్ పేట,

పాలకొల్లు, 9397151342


## ఈ సంచికలో. . . .


జపధ్యానముల ప్రయోజనం ........................................ 2


సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు ................ 3

శ్రీమద్భగవద్గీత ........................................................ 25


**ఇతర విషయములు :**

చావలి సూర్యనారాయణమూర్తి గారి వ్యాసం

సాగిరాజు రామకృష్ణంరాజు గారి వ్యాసం



ఎవరైతే నిరంతరం ఆత్మచింతన చేస్తున్నారో, దైవచింతన చేస్తున్నారో, వారి యోగక్షేమాలను భగవంతుడు చూసుకుంటాడు.

# జపధ్యానముల ప్రయోజనం

జపధ్యానములు అంటే ఏమిటో అనుకోవద్దు. మనం ఏదిగా ఉన్నామో దానిని పట్టి ఇవ్వటానికే, అక్కడికి తీసుకెళ్లటానికే జపధ్యానములు. నీచేత కొత్తగా పొందింప చేయటం ఏమీ లేదు. నీ హృదయములో ఒక నిజం ఉంది, దాని తాలూకు అనుభవం తీసుకొని రావటానికే ఈ జపధ్యానములు. నీ హృదయంలో ఒక నిజం ఉంది, అది సహజంగా ఉంది. ఈ జపధ్యానములు కూడా సహజం అయితే, ఆ సహజ వస్తువుని సంపాదించి పెడతాయి. అంటే మొట్టమొదటిలో నీ ప్రయత్నం ఉన్నా, తరువాత నీ ప్రయత్నం లేకుండా జరిగిపోతూ ఉండాలి. నువ్వు ఏ వస్తువునైతే ధ్యానం చేస్తున్నావో, ఏ వస్తువునైతే జపిస్తున్నావో, ఏరూపాన్ని ధ్యానం చేస్తున్నావో, ఏ నామాన్ని జపిస్తున్నావో వాటితో తదాకారం చెందాలి. ఈ మూడు శరీరము, మనస్సు, ఇంద్రియములు తదాకారం చెందాలి. అప్పుడు ఆ వస్తువు నీకు అనుభవైకవేద్యం అవుతుంది.

అది నోటితోటి చెప్పేది కాదు, చేతితోటి రాసేది కాదు. అది ఊహించేది కాదు, కాని నీ లోపల ఉంది, అది నీ అనుభవానికి అందుతుంది. నీ తలంపులు ఒక క్రమంలో లేవు. ఒక క్రమంలో లేవు కాబట్టి, నీకు అక్కరలేని ఆలోచనలు వస్తున్నాయి, అవసరం లేని తలంపులు, వ్యర్థమైన చింతలు, వ్యర్థమైన కోరికలు, వ్యర్థమైన ఊహలు, ఇవన్నీ వస్తాయని కృష్ణుడు చెపుతాడు. కొన్ని కొన్ని తలంపులు ఎటువంటివి వస్తాయంటే అవి మనకీ ఉపయోగపడవు, మన కుటుంబానికి ఉపయోగపడవు, సమాజానికి ఉపయోగపడవు. అటువంటి తలంపులు వస్తూ ఉంటాయి. దాని వలన మనకి టైం వేస్ట్ ఎనర్జీ వేస్ట్. వీటన్నిటిని ఒక క్రమంలో పెట్టేదే జపం. ఇవన్నీ ఒక క్రమంలో పెట్టేదే ధ్యానం. మీ మనస్సు అస్తవ్యస్తంగా ఉంది, ఒక క్రమంగా లేదు,జపధ్యానములు మీ మనస్సుని ఒక క్రమంలో పెడతాయి. నువ్వు ఏ మంత్రమైతే జపిస్తున్నావో దానికి అంటుకుపోతావు. అప్పుడు నీ మనస్సు అస్తవ్యస్తముగా ఉండదు. నిదానముగా ఉంటుంది, ఏకంగా ఉంటుంది. అంటే ఒకే ఆలోచన మీద, ఒకే తలంపుని అంటిపెట్టుకొని ఉంటుంది. ఇంక అశాంతి రాదు మనస్సుకి. కుదురు లేకపోవటం అంటూ ఉండదు. జప సాధన, ధ్యాన సాధన అలా సాగుతూ ఉంటే, ఎప్పుడో ఒక రోజున, నువ్వు ఏదిగా ఉన్నావో అది లోపలి నుంచి సహజంగా నీకు వ్యక్తమవుతుంది.

భగవాన్ చెపుతున్నారు జప ధ్యానములు యాంత్రికంగా ఉండకూడదు. నువ్వు ఏ నామాన్ని అయితే జపిస్తున్నావో అది ప్రీతిగా చెయ్యాలి, ప్రేమగా చెయ్యాలి. నీ మనస్సు అక్కడ నిలబడి ఉండాలి, అంటే సహజంగా ఉండాలి.

ఓం శ్రీనాన్న పరమాత్మనే నమః

# సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు - 14 నవంబర్ 1995, మురమళ్ళ

ప్రియమైన ఆత్మబంధువుల్లారా!

భగవద్గీత అంటే నరనారాయాణ సంవాదం అంటే నరుడికి వచ్చిన సందేహాలను తీర్చాడు నారాయణుడు. మన సందేహాలను భగవంతుడు కాకపోతే ఎవరు తీర్చగలరు? భగవంతుడే తీర్చగలడు. సామాన్యంగా మానవుడికి వచ్చే సందేహాలు అన్నీ కూడా అర్జునుడు ప్రశ్నించటం, దానికి సమాధానాలు భగవంతుడు వాసుదేవస్వామి వారు వివరించి చెప్పారు. భగవంతుడు చేత గానం చెయ్యబడింది భగవద్గీత. కృష్ణుడు కృష్ణుడిగా చెప్పలేదు, భగవంతుడై చెప్పాడు. భగవద్గీత ఉపదేశ గ్రంథం. మనకి ఉపనిషత్తులలో సబ్జెక్ట్ కానీ ఎక్కువ వెనకాల సపోర్ట్ ఉండదు. భగవద్గీతలో అలా కాకుండా విషయం చెబుతూ, నీకు నేను సపోర్ట్‌గా ఉంటాను అని ప్రతీ శ్లోకంలో కూడా భగవంతుడి సపోర్ట్ ఉంటుంది భగవద్గీతలో, ప్రపంచ ప్రఖ్యాతి పొందిన గ్రంథాలలో భగవద్గీత ఒకటి.

రమణమహర్షి గారిని ఒకసారి నన్ను భగవద్గీత ఎప్పుడైనా చదువుకోమంటారా అని ఒక భక్తుడు అడిగాడు. ఎప్పుడైనా చదువుకోవడం కాదు, Always, ఎప్పుడూ చదువుకో అన్నారు. గీతలో ఉన్న సందేశం, మనం మననం చెయ్యవలసిన అవసరం ఉంది. దాని వలన సందేహాలు నివృత్తి అవ్వటమే కాకుండా, మనం పవిత్రులం అవుతాము. మనం పూజ చేసినా, జపం చేసినా, అధ్యయనం చేసినా, శ్రవణం చేసినా మనం పవిత్రులం అవ్వడం కోసమే! హిందూమతస్తులే కాదు, ఏ మతస్తులు అయినా సరే ఈ పవిత్రత అనే గేటు ద్వారానే మోక్షంలోకి వెళ్ళాలి. పవిత్రత చాలా ముఖ్యం. రామకృష్ణుడికి బ్రహ్మానందం కలగడానికి కారణం ఆయనలో ఉన్న పవిత్రతే. Intelligence అవసరమే కానీ intelligence ఒక్కటే సరిపోదు. ఎవరికైనా సరే పవిత్రత లేకుండా మటుకి వస్తువు అనుభవంలోకి రాదు. ఎందుచేత అంటే ఆ వస్తువు పవిత్రమైనది. పరమ పవిత్రుడికే ఆ వస్తువు వ్యక్తం అవుతుంది. మనకి అందరికీ బ్రహ్మం తెలుసుకోవాలని ఉంది, తత్త్వం తెలుసుకోవాలని

ఉంది. అంతమాత్రంచేతే మనకి తెలియదు. ఆ బ్రహ్మం కూడా ఎవరికి తెలియబడాలి అనుకుందో వారికి మాత్రమే తెలియబడుతుంది. మనం చాలా మంచి వాళ్ళం అని మనం అనుకుంటే సరిపోదు, ఈశ్వరుడు అనుకోవాలి.

మనం అందరం భక్తులమే. మనకు ఎంతోకొంత పుణ్యబలం ఉంది, పుణ్య సంస్కారం ఏదో ఉంది, అందువలన పరమేశ్వరుడి పట్ల మనకి భక్తి కలిగింది. అందరికీ భక్తి ఉండవలసిందే. ఈ భక్తులను నాలుగు రకాలుగా పరమేశ్వరుడు విభజించాడు. ఒకటి ఆర్తులు, ఆర్తులు అంటే ఏమిటి? వాళ్లకి ఏమైనా కష్టం వచ్చినప్పుడో, దుఃఖం వచ్చినప్పుడో దేవుడిని తలచుకుంటారు. దేవుడి దయ వల్ల ఆ కష్టం పోయింది అనుకోండి మళ్ళీ దేవుడిని మర్చిపోతారు. వాడిని ఆర్తుడు అంటారు. తరువాత అర్థార్థి, వాడికి ఏవో కోరికలు ఉంటాయి. ఆత్మ కాని దానిని ఆత్మ అనుకుంటున్నాడు అనుకోండి వాడికి తప్పనిసరిగా కోరిక కలుగుతుంది. బేధబుద్ధి ఉన్నంత కాలం కోరిక వస్తూనే ఉంటుంది. కోరిక మనకి కలిగినప్పడు ఆ కోరికని satisfy చేసుకోవడం కోసం భగవంతుడిని ప్రార్థిస్తాము. మన శక్తి తోటి కోరిక నెరవేర్చుకోలేక పోతున్నాం కాబట్టి భగవంతుడి సహాయం కావాలి కాబట్టి ఆయన అనుగ్రహం ఉంటేనే కానీ కోరిక నెరవేరదు అని మనం గుర్తించినప్పడు ఆయనని ప్రార్థిస్తాము. మన వల్ల అయిపోతే మనం దేవుడిని ప్రార్థించము. మనవల్ల కాదు, దైవ సహాయం ఉంటేనే మనకి ఇది నెరవేరుతుంది అనుకున్నప్పుడే మనం దేవుడిని ప్రార్థిస్తాము. అలాగ మనకి కోరిక నెరవేరుతుంది. ప్రార్థనకి కూడా శక్తి ఉంది. ప్రార్థన వల్ల కూడా మనకి ఆ కోరిక నెరవేరుతుంది. మళ్ళీ ఆ కోరిక నెరవేరిన తరువాత దేవుడిని మర్చిపోతాం. అందరూ కాదు కొంతమందిని నేను చెబుతున్నాను. వీడు భక్తుడే అవ్వడానికి కానీ సెకండ్ క్లాస్ భక్తుడు. తరువాత జిజ్ఞాసువు ఉన్నాడు. జిజ్ఞాసువు అంటే సాధకుడు, జ్ఞాన సముపార్జనకి ప్రయత్నం చేసేవాడు జిజ్ఞాసువు. ఈ సాధకుడు, జ్ఞాని ఉత్తమభక్తులు. అంటే ఫస్ట్ క్లాసు భక్తులు. తత్వాన్ని గ్రహించడానికి వాళ్ళు సాధన చేస్తారు. వాళ్లకి లోక పరంగా పెద్ద విషయాలు ఏమీ ఉండవు కానీ తత్వాన్ని గ్రహించడానికే వాళ్ళు సాధన చేస్తారు. జ్ఞాన సముపార్జనకే సాధన చేస్తారు. చేసి వాడు దానిని అందుకోవడానికి, ఆ సద్వస్తువుని అందుకోవడానికి

ప్రయత్నం చేస్తూ ఉంటాడు. వాడు జిజ్ఞాసువు. ఏ తత్త్వం తెలుసుకోవడం కోసం అయితే జిజ్ఞాసువు ప్రయత్నం చేస్తాడో, వాడికి ఆ తత్త్వం తెలిసిన తరువాత, వాడి చేతికి అందిన తరువాత, వాడి అనుభవంలోకి వచ్చిన తరువాత వాడిని జ్ఞాని అంటారు. జ్ఞాని కూడా భక్తుడే అన్నాడు కృష్ణుడు. భగవంతుడిని విడిచి పెట్టి, ఆయన స్వరూపాన్ని విడిచి పెట్టి వేరుగా ఒక్క క్షణం కూడా ఉండడు. అందుచేత జ్ఞాని కూడా భక్తుడే అని భగవద్గీతలో స్వామి వారు చెప్పారు. అందుచేత నాలుగు రకాలు అయినటువంటి భక్తులు ఉన్నారు. ఒకవేళ మనం ఆర్తితో ప్రారంభించినా మనం జ్ఞాని స్థితికి వెళ్ళాలి. మేము ఒకటో తరగతిలో చేరాం, ఆ క్లాసులోంచి కదలము అనకూడదు. అంతకంటే పెద్ద క్లాసుకి వెళ్ళడానికి ప్రయత్నం చెయ్యాలి. మాకు జ్ఞానం వస్తుందా, రాదా, అని సందేహ పడనక్కరలేదు. అది వస్తుంది. ద్వైతం ఉన్నంతకాలం డౌట్ వస్తూ ఉంటుంది. జ్ఞానం మన స్వరూపమే, శాంతి మన స్వరూపమే, ఆనందం మన స్వరూపమే, సుఖం మన స్వరూపమే. అది అందకుండా మైండ్ disturb చేస్తుంది. ఇవ్వకూడని importance మనం మైండ్‌కి ఇస్తూ ఉంటాము. ఈ దేహానికి, మైండ్‌కి top మోస్ట్ importance ఇవ్వడం వల్లే మనకి అభిమానబుద్ధి కలుగుతుంది. చాలామందికి చిన్న మాట అంటే అభిమానం వచ్చేస్తుంది. దానికి కారణం ఏమిటి అంటే దేహానికి, మైండ్ కి, మనం ఎక్కువ ప్రాముఖ్యత ఇవ్వడం వల్లే అది వస్తుంది.

ఉపదేశ సారం చదివారు కదా, అవ్యయ ఆభవ పూర్ణచిత్సుఖం. నీ హృదయంలోనే ఉంది ఆ సుఖం. బయట ఎక్కడా సుఖం లేదు, ఉందని నీకు అనిపిస్తుంది. ఎన్ని జన్మలు ఎత్తినా నీకు బాహ్యంలో సుఖం దొరకదు. అక్కడ లేదు కాబట్టి, ఉంటే దొరుకుతుంది.



**ఏ సత్యం తెలుసుకోవటం కోసం మీరు సాధనలు చేస్తున్నారో,అది మిమ్మల్ని విడిచి ఎక్కడో దూరాన లేదు. అది మీరే!**

భగవంతుడు కూడా నేను హృదయంలో ఉన్నాను అని చెప్పి, అది అందరూ అర్థం చేసుకోలేరు కాబట్టి తరువాత కృష్ణుడు నేను, రాముడు నేను, స్కంధుడు నేను అని చెప్పాడు. అంటే ఆ హృదయంలో ఉన్న స్థితి మనం అర్థం చేసుకోవటం కష్టం. అందుచేత సాకారంగా ఉన్న రాముడు, కృష్ణుడు నేను అనిచెప్పాడు. నీ హృదయంలో ఎటువంటి సుఖం ఉంది? అవ్యయ ఆభవ పూర్ణ చిత్ సుఖం. అది ఎటువంటి సుఖం? నువ్వు ఎంత అనుభవించినా అది తరగదు. నీ హృదయంలో ఉన్న సుఖాన్ని నువ్వు enjoy చేస్తున్నావు అనుకో, అది నీకు అనుభవంలోకి వచ్చాక ఎంత అనుభవించినా కూడా అది తరగదు అప్పుడు అసలు నీ దేహం ఉందో లేదో నీకే తెలియదు. భాగవతంలో ఒక మాట ఉంది. బాగా సారా తాగిన వాడికి ఒంటి మీద బట్ట ఉందో లేదో తెలియదు. అలాగే ఆత్మ సుఖం అనుభవించిన వాడికి శరీరం ఉందో, లేదో తెలియదు. శరీరం ఉన్నా ఒక్కటే నాకు, ఊడిపోయినా ఒక్కటే అంటాడు, అట్టిది ఆత్మసుఖం, అది తరగదు. అవ్యయ, ఆభవ పుట్టని సుఖం అది. హృదయంలో ఉన్న సుఖం ఎటువంటిది? పుట్టని సుఖం. అంటే ఆత్మకి పుట్టుక లేదు. పుట్టుక లేని ఆత్మలో ఏ సుఖం ఉందో ఆ సుఖం నీకు అనుభవంలోకి వస్తుంది. పూర్ణంగా ఉంటుంది ఆ సుఖం. అందులో వెలితి ఏమీ ఉండదు. ఆ చిత్ సుఖం అంటే ఏమిటి? ఆత్మ సుఖం, చైతన్యం. చైతన్యానికి కారణం ఏమీ లేదు . అది ఉండడం వల్లే తెలుస్తూ ఉంటుంది. అటువంటి సుఖం ఎక్కడ ఉందంటే, నీ హృదయంలోనే ఉంది. దానికి ఏమి కావాలి? లోచూపు కావాలి. మనకి చర్మదృష్టి, శవదృష్టి ఎక్కువ, శివదృష్టి తక్కువ. శివదృష్టి వల్ల నీకు ఏమి కలుగుతుంది? లోదృష్టి కలుగుతుంది. లోదృష్టి కలగాలి అంటే రూపదృష్టి, నామదృష్టి తగ్గాలి. అంటే మనం ప్రపంచంలో ఏ వస్తువును చూసినా రూపదృష్టి తోటి, నామదృష్టి తోటి చూస్తాం. ఆ రూపదృష్టి తోటి, నామదృష్టి తోటి చూస్తున్నంత కాలం మనసు బాహ్యముఖానికి వెళుతుంది. బాహ్యముఖానికి పరుగుపెడుతున్నటువంటి నీ మనసుని, బాహ్యానికి విజృంభిస్తున్న నీ మనసుని, వెనక్కి మళ్ళించటమే గురువు చేస్తాడు. రూపం, నామం, క్రియ ఇవే ప్రపంచం. రూపదృష్టి, నామదృష్టి నువ్వు తగ్గించుకుంటే నీ మనస్సు దానంతట అదే ఉపసంహరింపబడుతుంది. అంటే ఈ పుస్తకం ఉంది అనుకోండి, నేను వదిలేస్తే

ఎక్కడ పడుతుంది? కింద పడుతుంది. అలాగే మీ మనసుకి ఎప్పుడైతే రూపదృష్టి, నామదృష్టి తగ్గిందో, దానంతట అదే హృదయంలోకి వెళ్ళిపోతుంది. ఎందుకు? దాని birth ప్లేస్ అదే. హృదయము అంటే నేను అనే తలంపు నీలో ఎక్కడ పుడుతుందో అదే హృదయం. దేవుడు ఉన్నాడో, లేడో వదిలేయండి. ముందు నేను లేనని ఎవడూ అనడు. ఆ నేను అనే తలంపు మీలో ఎక్కడ పుడుతుందో, ఎక్కడ ఉదయిస్తుందో అదే హృదయం. అయితే దానిని వేదాంత పరిభాషలో ఏమంటారు అంటే ఆధ్యాత్మిక హృదయం అంటారు. భౌతిక హృదయం మన రక్తాన్ని పంపు చేస్తుంది. ఈ ఆధ్యాత్మిక హృదయం నీ వాసనలు, నీ పూర్వ జన్మ గొడవలు, సంస్కారాలు ఇవన్నీ కూడా దాచిపెట్టి ఉంచుతుంది.

ఉపనిషత్తులలో చెప్పారు లోభి తన ధనాన్ని ఎంత జాగ్రత్తగా చూసుకుంటాడో, అలాగే నువ్వు చేసిన పనులు, నీకు వచ్చిన తలంపులు, ఇవన్నీ హృదయం జాగ్రత్తపెట్టి ఉంచుతుంది. అందుచేత మనం ఏదైనా చెడ్డ చేస్తే దానికి ఎప్పుడో ఒకప్పుడు సమాధానం చెప్పి తీరాలి. మంచి చేసినా అంతే! ఏదైనా మనలో తలంపు ఉంది అనుకోండి, అది మంచి తలంపు అయినా, చెడు తలంపు అయినా కూడా ఏదో ఒక రకంగా మనకి అనుభవంలోకి రాకుండా అది బయటకు వెళ్ళదు. పది జన్మల తరువాత అయినా ఆ వాసన తలంపుగా వస్తుంది. ఆ తలంపు వల్ల మంచో, చెడ్డో మనం అనుభవిస్తేనే కానీ అది బయటకి పోదు. అనుభవిస్తే బయటకి పోతుంది. అందుచేత మనం కంగారు పడనక్కరలేదు. ధ్యానం చెయ్యడం అంటే ఏమిటి? యుద్ధం. అంటే నువ్వు ఏదో ఒక తలంపు మీదే నీ మనసుని నిలబెట్టి ఉంచుతావు. అప్పుడు మిగతా తలంపులు అన్నీ ముసిరేస్తూ ఉంటాయి. ఎప్పుడైతే ఒక తలంపు మీద నిలబడ్డావో, మిగతా తలంపులకి ఫుడ్ ఆగిపోతుంది. అప్పుడు అవి స్లోగా వీక్ అయిపోతాయి. అందుచేత మీకు ధ్యానం కూడా ఒక యుద్ధం లాంటిదే. ధ్యానం చెయ్యటం మంచిదే. రమణమహర్షి గారిని ఒకరు గురువు అవసరమా అని అడిగారు. నువ్వు లఘువుగా ఉన్నంత కాలం గురువు అవసరం అని చెప్పారు. ఒక వీక్ మైండ్‌కి స్ట్రాంగ్ మైండ్ యొక్క సపోర్ట్ అవసరం. వ్యవహారికంగా కూడా ఒక వీక్ మైండ్‌కి ఒక స్ట్రాంగ్ మైండ్ సపోర్ట్ ఉండాలి. అలాగే గురువు అవసరమా అంటే నువ్వు లఘువుగా ఉన్నంత

కాలం గురువు నీకు అవసరం. ఒక భక్తురాలు ఏమని అడుగుతున్నారు అంటే ఆత్మసిద్ధికి గురువు అవసరమా? ఆత్మ అంటే ఎవరో అనుకోకండి, మీరే! మీకు తెలియకపోయినా అది మీరే. దానికి పుట్టుక లేదు. మీకు ఆత్మానుభవం కలిగిన వెంటనే నాకు పుట్టుక లేదు అన్న సంగతి మీకు తెలుస్తుంది. అప్పుడు వాడు మోక్షానికి అర్హుడు. నేను పుట్టాను అనుకున్న వాడికి ఎవడికి మోక్షం రాదు అన్నారు రమణస్వామి. నేను పుట్టాను అనుకుంటున్నావు అంటే దేహం పుట్టింది కాబట్టి దానితోటి తాదాత్మ్యం పొందుతున్నావు. ఆత్మానుభవం వచ్చిన తరువాత అసలు నాకు పుట్టుకే లేదు అన్న సంగతి వాడికి తెలుస్తుంది. ఎందుచేత? ఆత్మకు పుట్టుక లేదు కాబట్టి, అందుచేత నేను పుట్టాను అనుకున్నవాడికి మోక్షం దొరకదు. అంటే వాడికి అక్కడ దేహబుద్ధి ఉంది.

మనం చేసే సాధనకి ఒక లక్ష్యం ఉండాలి. జీవితంలో లక్ష్యం లేకుండా జీవించ కూడదు. సృష్టిలో అన్నిటికంటే పరమ పవిత్రమైనది, ఉదాత్తమైనది జ్ఞానం. జ్ఞానం అంటే రమణమహర్షి గారు లోకజ్ఞానం గురించి, శాస్త్రజ్ఞానం గురించి ఆయన చెప్పలేదు. ప్రపంచం అంతా కూడా ఒక తత్త్వం వ్యాపించి ఉంది. మొత్తం సృష్టి అంతా కూడా, ఈ లోకమే కాదు మొత్తం ఇతర లోకాల్లో కూడా ఏ తత్త్వం అయితే వ్యాపించి ఉందో, ఆ తత్త్వం నీ హృదయంలో కూడా ఉంది. ఇప్పుడు నీ మనస్సు నీకు ఏ విధంగా అయితే నేనుగా వ్యక్తం అవుతుందో, అలాగే నీ హృదయంలో ఉన్న తత్త్వం నీకు నేనుగా వ్యక్తం అయితే అది జ్ఞానం. అది మిథ్యా జ్ఞానం కాదు ఆత్మజ్ఞానం. అది true knowledge. వైకుంఠం అంటే నీ మనస్సు ఎక్కడ లయం అవుతుందో, నేను అనే తలంపు ఎక్కడ లయం అయ్యి కరిగిపోతుందో అదే వైకుంఠం అని చెప్పారు రమణాచార్యుడు. బాహ్యంగా ఉన్న వైకుంఠానికి వెళితే వెళ్ళచ్చు మళ్ళీ మురమళ్ల వచ్చేయాలి మనం. రాకపోకలు తప్పవు. మొత్తం అన్ని బాధలకి మనస్సే కారణం. అది అణిగిపోతే ఏది లేదు. మనస్సు ఉంటే నువ్వు ఉన్నావు, మనస్సు ఉంటే నేను ఉన్నాను, మనస్సు ఉంటే పూర్వజన్మ ఉంది, మనస్సు ఉంటే రాబోయే జన్మ ఉంది. ఇంకా ఇతర లోకాలు ఉన్నాయి. మనస్సు ఉంటే అంతా ఉంది. అది లేకపోతే ఏది లేదు అని చెప్పారు. మనస్సు ఉంటే అంతా ఉంది, అది లేకపోతే ఏది లేదు. దాన్ని తీసేయ్యమంటున్నాడు అదే

సాధన యొక్క ప్రయోజనం. మనస్సు అనే మూకుడు బయటకి తీసెయ్యి, కుండలో ఉన్న అన్నం నీకు కనిపిస్తుంది. నీ హృదయంలో ఉన్న శాంతి నీకు దొరుకుతుంది. నీ హృదయంలో ఉన్న శాంతికి పైన మనస్సు మూకుడుగా ఉంది. ఆ మూకుడు నువ్వు పక్కకి తొలగిస్తే శాంతి నువ్వు కనిపెట్టక్కరలేదు, అది నీ హృదయంలో సిద్ధంగా ఉంది. సిద్ధ పురుషుడు అంటే జ్ఞానినే సిద్ధ పురుషుడు అంటారు. సిద్ధంగా ఉన్న వస్తువును ఎవరైతే గ్రహించాడో, ఎవడైతే సిద్ధంగా ఉన్న వస్తువుని తెలుసుకున్నాడో వాడే సిద్ధ పురుషుడు. ఒక్క జ్ఞానిని మాత్రమే సిద్ధ పురుషుడు అని పిలుస్తారు. మన శరీరం మరణించిన తరువాత మనకి ఉన్న బంధువుల తోటి, మనకున్న స్నేహితుల తోటి, మనకున్న పరిసరాల తోటి సంబంధం తెగిపోతుంది కానీ గురువు తోటి ఉన్న సంబంధం తెగదు వాడే గురువు. ఎందుచేత అంటే శిష్యుడు మరచిపోయినా గురువు వీడిని మరచిపోడు. గురువు అంటే ఎవరు? ఆత్మ. వాడు ఎక్కడ ఉన్నాడు? నీ హృదయంలోనే ఉన్నాడు. నీ శరీరం మరణించినా, ఎక్కడ పుట్టినా నిన్ను చూసుకుంటూ ఉంటాడు. పులి నోట్లో పడ్డ మాంసపు ముక్క బయటకి లాగచ్చు కానీ గురువు అనుగ్రహంలో పడ్డవాడు రక్షింపబడతాడు, కానీ వాడు అక్కడ నుంచి escape అవ్వడానికి అవకాశం లేదు అన్నాడు రమణాచార్యుడు. అంటే గురువు అనుగ్రహంలో పడ్డవాడు, గురువుదృష్టిలో పడ్డవాడు రక్షింపబడతాడు. వాడు మోక్షం పొందేవరకు, ఆత్మ సామ్రాజ్యానికి అధిపతి అయ్యేవరకు వాడిని గురువు విడిచి పెట్టడు. మన శరీరం మరణించినప్పుడు అందరి తోటి చుట్టాల తోటి, స్నేహితుల తోటి, కుటుంబ సభ్యుల తోటి, పరిసరాల తోటి, ఇరుగు పొరుగు వారి తోటి, అందరితోటి సంబంధం తెగిపోతుంది కానీ



**ఆత్మానందం మనం అనుభవిస్తూ ఉంటే, ఏ క్షణానికి ఆ క్షణమే మధురాతి మధురంగా ఉంటుంది.**

గురువు తోటి మటుకి సంబంధం తెగదు. గురువు అంటే మనకి పెద్ద చుట్టం. ఈ శరీరం పడిపోయినా ఆ చుట్టం మనల్ని విడిచి పెట్టడు. బ్రహ్మానుభవం కలిగే వరకు మనలని వెంటాడుతూనే ఉంటాడు. మనం ఏ జన్మలో ఉన్నామో, ఏ శరీరం తొడిగామో, ఎక్కడ ఉన్నామో చూసుకుంటూ ఉంటాడు గురువు. వాడు ఎలా ఉన్నాడు? మన హృదయంలోనే ఆత్మగా ఉన్నాడు కదా, వాడి స్వరూపాన్ని మనకి ఇచ్చే వరకు, వాడి స్వరూపాన్ని మనకి ఇవ్వడానికి మనలో ఏ ఆటంకాలు ఉన్నాయో అవి తొలగించేవరకు మనల్ని విడిచిపెట్టడు వాడే గురువు.

గురువు అవసరం లేకుండా కూడా జ్ఞానం సంపాదించవచ్చు అని చెబుతున్నారు జిడ్డు కృష్ణమూర్తి గారు, దాని గురించి మీ అభిప్రాయం ఏమిటి? అని రమణమహర్షి గారిని అడిగారు. జిడ్డు కృష్ణమూర్తి గారికి గురువు అవసరం లేకపోవచ్చు. అందరికీ గురువు అవసరం లేదు అని ఆయనకి ఎలా తెలుసు? అన్నారు. అంటే ఆయన ఏమి సమాధానం చెప్పినా సహేతుకంగా ఉంటుంది. అది సమగ్రంగా ఉంటుంది, సరళంగా ఉంటుంది. జిడ్డు కృష్ణమూర్తి గారికి గురువు అవసరం లేకపోవచ్చు, రైటే. కానీ లోకంలో ఉన్న వాళ్లకి గురువు అవసరం లేదు అన్న సంగతి ఆయనకి ఎలా తెలుసు? బోధ, శ్రవణ, ధ్యానాదులు కన్నా ఎక్కువ గురువు అనుగ్రహమే అత్యంత బలీయమైనది. గురువుకి సేవ చెయ్యటం ద్వారా కూడా, గురువుయందు ప్రేమ కలిగి ఉండడం వల్ల కూడా మీకు జ్ఞానం కలుగుతుంది. చిట్కాలు నేర్చుకోండి, పెద్ద ఎక్కువ కష్టపడి పోనక్కర్లేదు. ఎదుటి మనిషిని గౌరవంగా చూడటం వల్ల మనకి అహంభావం తగ్గుతుంది. ఎదుటి మనిషిని అగౌరవంగా చూడటం వల్ల మనకి అహంభావం పెరుగుతుంది. ఎదుటి మనిషిని గౌరవించడం వల్ల పైగా మనకి నష్టం లేదు. కొంతమంది మాట్లాడితే హేళనగా మాట్లాడతారు. అదొక అలవాటు. హేళనగా మాట్లాడడం వల్ల అహంభావం వాళ్లకి తెలియకుండా పెరిగిపోతుంది. మీరు హేళనగా మాట్లాడకుండా, నెమ్మదిగా మాట్లాడుతూ, నిశ్చలంగా మాట్లాడుతూ, నిదానంగా మాట్లాడుతూ, వాళ్ళ శ్రేయస్సు కోరి మీరు మాట్లాడుతుంటే, వాడి చైతన్య స్థాయి పెరగాలి అనే సహృదయంతో మీరు మాట్లాడుతుంటే మీకు తెలియకుండా మీ అహంభావం

తగ్గుతుంది. మాట కూడా మనం జాగ్రత్తగా మాట్లాడాలి, ఆలోచించి మాట్లాడాలి. మాట కూడా చాలా ముఖ్యం. చాలా జాగ్రత్తగా మాట్లాడాలి. బోధ, శ్రవణ, ధ్యానాదులు కన్నా ఎక్కువ గురువు అనుగ్రహమే దానిని ఫలింప చేస్తుంది, గురువు అనుగ్రహం అత్యంత బలీయమైనది. మిగతావి అన్నీ రెండవ పక్షం. ఈ చదువుకోవడాలు, ఇవన్నీ కూడా, దానివల్ల ఫలితాలు ఉంటాయి. అవన్నీ కూడా రెండవ పక్షం. శ్రవణాలు చెయ్యడం ఇవన్నీ సెకండరీ. అతి ప్రధానము, సారవంతము గురువు అనుగ్రహం మాత్రమే. ఆత్మకు మరొక పేరే అనుగ్రహం. ఈశ్వరుడు అనుగ్రహం లేకుండా లేడు. ఎందుచేత? ఆయన స్వరూపమే అనుగ్రహం. ఉన్న వస్తువు ఒక్కటే, అదే బ్రహ్మం. అది విడిచి పెట్టి మిగతా విషయాలు ఏది మాట్లాడినా, రమణమహర్షి గారు ఒక మాట అనేవారు లేని దానిని గురించి మిమ్మల్ని ఎవరు ఆలోచించమన్నారు? దాని గురించి ఎవరు మాట్లాడమన్నారు? ఉన్న వస్తువు ఒక్కటే. దాని గురించే మీరు శ్రవణం చెయ్యండి, దాని గురించే మీరు మననం చెయ్యండి, విసుగు వచ్చేలా చెయ్యండి, అప్పుడు అది మీకు అనుభవంలోకి వస్తుంది. లేని గొడవలు గురించి మిమ్మల్ని ఎవరు ఆలోచించమన్నారు? అక్కర్లేని గొడవలు అన్నీ ఎవరు మిమ్మల్ని తలపెట్టుకోమన్నారు? అంటూ ఉండేవారు. అదంతా మాయ. ఏదైతే లేదో అది మాయ.

నీ శాంతికి, నీ సుఖానికి, నీ శారీరక ఆరోగ్యానికి, నీ మానసిక ఆరోగ్యానికి, ఏ అలవాట్లు అయితే అడ్డుగా ఉంటున్నాయో, ఆ అలవాట్లను నువ్వు తొలగించుకోవడానికి ప్రయత్నం చెయ్యి. దానిని పోగొట్టుకోవడం ఎలాగ అంటే, నువ్వు ఆత్మ కోసం వెతకడం ప్రారంభించు. అంటే నువ్వు దేవుడు కోసం వెతకడం ప్రారంభించు. ఇప్పుడు మనం తూర్పుకి వెలుతుంటే పడమరకు దూరం అవుతాం. పడమరకు వెలుతుంటే తూర్పుకి దూరం అవుతాం. అంతేకదా, అమలాపురం వెళ్ళేకొలది మురమళ్లకి దూరం అవుతాం. మురమళ్ల వస్తుంటే అమలాపురం దూరం అవుతుంది. అదే విధంగా నీ హృదయంలో ఉన్న ఈశ్వరుడిని, పరమేశ్వరుడిని, ఆ సర్వేశ్వరుడిని దర్శించుకోవడం కోసం నువ్వు ప్రయత్నం మొదలు పెడితే ఆయన యందు ఆకర్షించబడుతుంటే నువ్వు, నిరంతరం ఈశ్వరుడిని చింతిస్తుంటే, ఆయన రూపాన్ని ధ్యానం చేస్తుంటే, ఆయన చెప్పిన మాటలని వింటూ ఉంటే, ఈశ్వరుడు

చేసిన లీలలను నువ్వు జ్ఞాపకానికి తెచ్చుకుంటూ ఉంటే, ఈ దురలవాట్లకి నీకు తెలియకుండానే నువ్వు దూరం అవుతావు అంటున్నాడు రమణాచార్యుడు. వాటి తోటి నువ్వు కుస్తీ పట్టక్కర్లేదు. అలవాట్ల తోటి కుస్తీ పడితే, వాసనల తోటి కుస్తీ పడితే నీ సాధన వయసు సంవత్సరం, వాటి వయస్సేమో కొన్ని వేల సంవత్సరాలు అందుచేత వాటి చేతిలో నువ్వు ఓడిపోతావు. అందుచేత నువ్వు పరమేశ్వరుడిని స్మరించుకుంటూ, నీ పని ఏదో నువ్వు చూసుకుంటూ ఉండు. అప్పుడు నెమ్మదిగా దురలవాట్లు నిన్ను విడిచి పెట్టి బయటకి పోతాయి అంటున్నారు. మీకు అర్థం అవుతోందా? మీరు ఆ దురలవాట్లని స్మరించడం మానేస్తే, ఈశ్వరుడిని స్మరించుకుంటూ ఉంటే ఈ అలవాట్లకి మీరు దూరం అవుతారు. దూరం అయ్యేకొలది అవి మీకు తెలియకుండానే రాలిపోతాయి. ఈ చిక్కువిడిపోయేది కాదు. ఈ దురలవాట్ల నుండి బయట పడడం మీరు చెప్పినంత తేలిక కాదు, ఇది కష్టమే అంటున్నాడు ఈ భక్తుడు.

ఈ మధ్య ఒక డాక్టరు గారు రోగితోటి "నువ్వు సిగరెట్లు కాల్చడం వెంటనే మానేయాలి. నువ్వు సిగరెట్లు కాల్చడం మానకపోతే నీ రెండు కాళ్ళు తీసేయవలసి వస్తుంది" అన్నారు. వాడి జబ్బు ఏమిటో మనకి తెలియదు. ఆ రోగి "ఈ రెండు కాళ్ళు తీసేసినా నాకు ఇష్టమే కానీ సిగరెట్లు కాల్చే అలవాటు మటుకి నేను వదులుకోను" అన్నాడు. అంటే దానికి అంత అలవాటుపడిపోయాడు. ఈ అహంకారాన్ని పోగొట్టుకోమంటున్నారు మీరు, మాట తేలికగానే చెబుతున్నారు. పోగొట్టుకోవడం అంత తేలిక కాదు అని ఈ భక్తుడు అంటున్నాడు. నిజమే నువ్వు చెప్పేది బాగానే చెబుతున్నావు. ఈ అహంకారం వల్లే అన్ని చిక్కులు. కుటుంబంలో వచ్చినా, గ్రామంలో వచ్చినా, సమాజ పరంగా వచ్చినా, ఈ చిక్కులు, ఈ చిరాకులు, ఇవన్నీ అహంకారం వల్లే వస్తున్నాయి. వీటన్నిటికీ కూడా అహంకారమే కారణం, కొన్ని కొన్ని పేచీలకి కారణం ఉండదు. ఈ పేచీలకి కారణం ఏమిటి అని వెతికితే చివరికి అహంకారమే కారణం అని తేలుతుంది. చాలా పేచీలకి అహంకారమే కారణం. అందుచేత అహంకారంలో ఉన్న కారం తీసేయ్యమంటున్నాడు ఈయన. భగవాన్ చెప్పేది ఏమిటంటే అహంకారంలో అహం ఉన్నా ఇబ్బంది లేదు కారం తీసెయ్యమంటున్నారు. పరస్పర విరోధాలకి కూడా అదే

కారణం. ఇక్కడ భగవాన్ ఏమంటున్నారు అంటే, నువ్వు ఆత్మని వెతకటం కష్టం అంటున్నావు. ఆత్మని వెతకటం నీకు కష్టం అయితే, ఆత్మని వెతికే వాడు నీ లోపల ఒకడు ఉన్నాడు కదా, వాడు ఎవడో కనుక్కో. కొంతమంది నాకు దేవుడిని తెలుసుకోవాలి అని ఉంది అంటారు. భగవాన్ అన్నారు దేవుడిని తెలుసుకోవాలి అనుకునేవాడు నీ లోపల ఒకడు ఉన్నాడు కదా, వాడు ఎవడో తెలుసుకో సరిపోతుంది. దేవుడిని తెలుసుకోవాలి అని నువ్వు అనుకుంటున్నావు. సరే మంచిదే తెలుసుకో, ఆ రకంగా నీకు ఇష్టమైతే తెలుసుకో, దేవుడిని తెలుసుకోవాలి అనుకునేవాడు నీ లోపల ఒకడు ఉండాలి కదా, నీ శరీరం అనుకోవటం లేదు తెలుసుకోమని, ఎవడో ఒకడు నీ లోపల ఉన్నాడు వాడు అనుకుంటున్నాడు దేవుడిని తెలుసుకోమని, వాడిని తెలుసుకున్నా దేవుడు తెలియబడతాడు అంటున్నారు. మనం అందరం చచ్చిపోయిన తరువాత స్వర్గ లోకానికి వెళ్లాలని, వైకుంఠానికి వెళ్లాలని పూజలు చేస్తూ ఉంటాం, జపాలు చేస్తూ ఉంటాం. అసలు ఉద్దేశ్యం అది, ఎక్కడికో వైకుంఠానికి వెళ్లిపోదాం, కైలాసానికి వెళ్లిపోదాంఅని. అంటే వైకుంఠానికి వెళ్ళే ఈ నేను ఎవరు? కైలాసానికి వెళ్ళే ఈ నేను ఎవరు? దీనిని బోనులో పెట్టి విచారణ చెయ్యమంటున్నారు అదే జ్ఞానమార్గం అని చెబుతున్నారు రమణాచార్యుడు. నువ్వు చనిపోయిన తరువాత ఎక్కడికో వెళ్తావు, కైలాసానికి వెళ్తావు, వైకుంఠానికి వెళ్తావు బాగానే ఉంది. వెళ్ళడానికి ఒకడు ఉండాలి కదా, వాడు ఈ బుజ్జిగాడే, ఈజీవుడే వెళతాడు. ఎవడైతే మనకి ఇప్పుడు నేనుగా వ్యక్తం అవుతున్నాడో, వీడే వైకుంఠానికి వెళ్లినా, కైలాసానికి వెళ్లినా, వాడిని ఒకసారి బోను ఎక్కించి విచారణ చెయ్యి. అదే జ్ఞానమార్గం. వాడిని విచారణ చెయ్యడమే జ్ఞానమార్గం. ఆత్మని తెలుసుకోవాలని



**మనకి ఇష్టం ఉన్నా, ఇష్టం లేకపోయినా, మన ఇష్టాలను అయిష్టాలను ప్రక్కన పెట్టి, భగవంతుడికి ఇష్టమైన పనిని మనం చెయ్యటం వలన మనస్సు నశిస్తుంది.**

నువ్వు అనుకుంటున్నావు రైటే. ఆత్మను తెలుసుకోవాలని అనుకునేవాడు ఎవడు? వాడిని వెతుక్కో. పోనీ, వాడిని వెతికినా నువ్వు ఆత్మని కనుగొంటావు.

**అహ మయం కుతో భవతి చిన్వతః**

**అయి పత త్యహం నిజ విచారణం ॥**

ఏదైతే నీకు నేనుగా వ్యక్తం అవుతుందో దాని మూలాన్ని, దాని సోర్స్ ని, తెలుసుకోవడానికి నువ్వు చేసే ప్రయత్నమే నిజ విచారణ. అది ఏ సోర్స్ లోంచి వస్తుందో దానిని నువ్వు వెతుకు. వెతికితే దాని సోర్స్‌లోకి అది withdraw అవుతుంది. ఆ నేను యొక్క మూలాన్ని నువ్వు వెతకడమే నిజ విచారణ. రమణమహర్షి గారు ఆత్మానుభవం పొందడానికి మూడు మార్గాలు చెప్పారు. దానిని మార్గ త్రయం అంటారు. అంటే నీ స్వరూపం వ్యక్తం కావడం కోసం మూడు మార్గాలు చెప్పారు. అవి ఏమిటంటే ఒకటి ఆత్మని వెతకడం, రెండు ఆత్మలో మునగడం, మూడు ప్రాణాయామం. స్థూలబుద్ధి ఉన్న వాళ్లకి ప్రాణాయామం. సూక్ష్మబుద్ధి ఉన్న వాళ్లకి ఆత్మని వెతకటం, ఆత్మలో మునగడం. ఆత్మలో మునగడం అంటే ఏమిటంటే, ఇప్పుడు నీ మనస్సు ఎక్కడ ఉంది? శిరస్సులో ఉంది. మనస్సు శిరస్సులో ఉండడానికి నీ ప్రయత్నం అక్కర్లేదు. మనస్సుని హృదయంలో నిలబెట్టి ఉంచడానికి ప్రయత్నం కావాలి. మనస్సుకి పుట్టిల్లు హృదయం, అత్తవారిల్లు శిరస్సు. అందుచేత అది ఏమి చేస్తుంది? రాత్రుళ్ళు పుట్టింటివద్ద ఉంటుంది, పగలు అత్తవారింటి వద్ద ఉంటుంది. మనస్సుని ఎక్కడకి పంపాలి నువ్వు? పుట్టింటికి పంపాలి. అది పుట్టిన చోటుకి పంపాలి. మనస్సు ఇప్పుడు నీ శిరస్సులో ఎంత నార్మల్‌గా ఉంటుందో, ఎంత naturalగా ఉంటుందో, అదే విధంగా నీ మనస్సుని హృదయ స్థానంలో నిలబెట్టి ఉంచగలగాలి నువ్వు. ఏదో కష్టంగా ఉండకూడదు. అది naturalగా ఉండాలి. అది normalగా ఉండాలి. నీ ఇంటివద్ద ఎలా ఉంటున్నావో అలా ఉండు కానీ చుట్టాలు ఇంటివద్ద ఎలా ఉంటున్నావో అలా ఉండకు నువ్వు. మీకు అర్థం అవుతోందా? మన ఇంటివద్ద మనం naturalగా ఉంటాం. చుట్టాలు ఇంటికి వెళితే అంత naturalగా ఉండము, టెన్షన్ వస్తుంది మనకి. నీ మనస్సు naturalగా హృదయంలో ఉండాలి. నీ

సాధన లేకుండా, నీ ప్రయత్నం లేకుండా మనస్సు నీ శిరస్సులో ఎలా ఉంటుందో, నీ హృదయంలో అలా దానిని నిలబెట్టి ఉంచు. నీ హృదయంలో మనస్సుని ఎప్పుడైతే నిలబెట్టి ఉంచగలిగావో అప్పుడు దానికి రూపదృష్టి, నామదృష్టి తగ్గుతుంది. అప్పుడు నెమ్మదిగా హృదయంలో కరిగిపోవటం ప్రారంభం అవుతుంది. మనస్సుని హృదయంలో ముంచు, దేవుడిలో ముంచు, చైతన్యంలో ముంచు, ముంచితే మనస్సు కరిగిపోతుంది.

భగవాన్ ఎప్పుడూ చెబుతూ ఉండేవారు. అందరూ మేము వైకుంఠానికి వెళ్లిపోవాలి, వైకుంఠానికి వెళ్లిపోవాలి అనుకునే వాళ్ళే, కానీ వైకుంఠానికి వెళ్ళే ఈ నేను ఎవరు అనేది విచారణ చెయ్యడం లేదు. మేము వైకుంఠానికి వెళ్ళిపోతాం, మేము వైకుంఠానికి వెళ్ళిపోతాం అనుకునే వాళ్ళే కానీ వైకుంఠానికి వెళ్ళే ఈ నేను ఎవరో, ఎవ్వరూ విచారణ చెయ్యటం లేదు. అందుచేత నీ హృదయంలో దానిని ముంచటం. మునగడం అంటే మనస్సుని ఆత్మలో నిలబెట్టి ఉంచడం. రెండోది ఏమిటి? విచారణ. దీని మూలాన్ని వెతకటం. దేని మూలాన్ని? ఈ దేహగతమైన నేను యొక్క మూలాన్ని వెతకడం. అది విచారణ. అవి రెండు సూక్ష్మబుద్ధి ఉన్న వాళ్ళకి సాధ్యం. కొంతమందికి సూక్ష్మబుద్ధి ఉండదు, స్థూలబుద్ధి ఉంటుంది. అసలు బుద్ధి లేకుండా మనిషి ఉండడు. నీకు బుద్ధి లేదు ఏంటిరా అంటారు. కొంచెం తక్కువ బుద్ధి ఉన్నవాడిని బుద్ధి లేదు అంటారు కానీ, అసలు మొత్తానికే బుద్ధి లేకుండా వాడు ఉండడు. దేహం కంటే ఇంద్రియాలు గొప్పవి, ఇంద్రియాలు కంటే మనసు గొప్పది. మనసు కంటే బుద్ధి గొప్పది, బుద్ధి కంటే ఆత్మ గొప్పది అని పరమాత్మ గీతలో చెప్పాడు. అన్నిటికంటే ఏది గొప్పది? ఆత్మ గొప్పది. అందుచేత సూక్ష్మబుద్ధి ఉన్నవాడికి, ఆత్మలో మునగడం, ఆత్మను విచారణ చెయ్యడం సాధ్య పడుతుంది. కొంతమందికి స్థూలబుద్ధి ఉంటుంది. అంటే శబ్దాన్ని విన్నా ఆ శబ్దంలో ఉన్న తాత్పర్యం కానీ, ఆ శబ్దంలో ఉన్న సందేశాన్ని కానీ గ్రహించే శక్తి స్థూలబుద్ధి ఉన్న వాళ్లకి ఉండదు. నాకు ఏదో కనిపించాలి, ప్రతీదీ చూడాలి అంటాడు. స్థూలబుద్ధి ఉంటుంది వాడికి, స్థూలబుద్ధి ఉన్నవాడు సైంటిస్టు అవ్వలేడు, సెయింట్ అవ్వలేడు. ఎవడికైతే సూక్ష్మబుద్ధి ఉందో వాడే సైంటిస్టు అవుతాడు, వాడే సెయింట్ అవుతాడు. బాహ్య ప్రకృతిని పరిశోధించేవాడు, బాహ్య ప్రకృతిని శోధించేవాడు సైంటిస్టు.

లోపల ప్రకృతులను శోధించి, లోపల దురలవాట్లను తొలగించుకున్నవాడు, లోపల ప్రకృతిని జయించిన వాడు సెయింట్ అవుతాడు. నువ్వు ఇదైనా చెయ్యి, అదైనా చెయ్యి. మనం దానికి పనికి రావడం లేదు, దీనికి పనికి రావడం లేదు. నువ్వు బాహ్య ప్రకృతిని శోధిస్తే సైంటిస్టు అవుతావు, లోపల ప్రకృతిని శోధిస్తే సెయింట్ అవుతావు నువ్వు. లోపల naturalగా ఉన్న దానిని నీ స్వాధీనంలోకి తెచ్చుకోవటానికి నువ్వు ప్రయత్నం చెయ్యి. స్థూలదృష్టి ఉన్న వాడికి ప్రాణాయామం చెప్పాడు. అంటే ప్రాణాన్ని అదుపులో తెచ్చుకోవడానికే ప్రాణాయామం. అంటే ప్రాణం ఏమో డ్రైవర్, మనస్సు ఏమో గార్డ్. మనకు ముక్కులో గాలి తిరుగుతూ ఉంటుంది. లోపలకు వెళుతూ ఉంటుంది, బయటకు వస్తూ ఉంటుంది. రమణమహర్షి గారు చెప్పిన ప్రాణాయామం ఏమిటి అంటే బిగపెట్టకు నువ్వు, కుంభకాలు అటువంటివి నువ్వు చెయ్యక్కర్లేదు. నువ్వు ఎదుటి మనిషిని ఎలా చూస్తూ ఉంటావో, నేను నిన్ను ఎలా చూస్తున్నానో, అలా నీ ముక్కులో గాలి చూసుకోమన్నారు. అంటే మీకు తెలిసున్నా, మీకు తెలియకపోయినా గాలి లోపలకి వెళుతూ ఉంటుంది. అది మళ్ళీ బయటకి వస్తూ ఉంటుంది. దానిని ఆపు చేయకు నువ్వు. కుంభకం దాని అంతట అదే వచ్చేస్తుంది. నువ్వు ప్రత్యేకంగా ఆపు చెయ్యక్కర్లేదు. గాలిని చూస్తూ ఉండు.

రమణమహర్షి గారి దగ్గర ఒక అబ్బాయి కూర్చున్నాడు. వాడు ఎక్కడో ప్రాణాయామం నేర్చుకుని వచ్చాడు. లోపలకి గాలి పీల్చుకున్నాడు. లోపలకి గాలి పీల్చుకున్న తరువాత కొంతసేపు అది ఆపు చెయ్యాలి. ఆపు చేసిన తరువాత మళ్ళీ దానిని విడిచి పెట్టాలి. ప్రాణాయామానికి ఒక క్రమం ఉంది. అబ్బాయి ఏమి చేశాడు అంటే గాలి పీల్చుకున్నాడు కానీ బయటకి వచ్చేస్తోంది, కుంభకం చెయ్యలేకపోతున్నాడు. స్వామి స్వామి నేను పీల్చుకున్న గాలి అంతా బయటకి వచ్చేస్తోంది అన్నాడు. ఆ మొత్తం గాలి బయటకి వస్తే దరిద్రం వదులుతుందిరా అన్నారు ఆయన. నీకు సగం గాలే బయటకి వస్తుంది మొత్తం గాలి బయటకి వచ్చేస్తే పీడ వదులుతుంది అన్నారు. అంటే ఆ గొడవ అక్కర్లేదు నీకు, లోపలకి వెళ్ళే గాలిని, బయటకి వచ్చే గాలిని చూస్తూ ఉండు. ఏమి బిగపెట్టకు నువ్వు. చూడటం వల్ల ఏమి అవుతుంది అంటే, లోపల వీళ్ళు ఇద్దరికీ సోర్స్ ఒక్కటే. ఈ ప్రాణం, మనస్సు లోపల

ఒకే సోర్స్ లోంచి వచ్చాయి ఇవి. వీటి సోర్స్ ఒక్కటే. మీకు ఎప్పుడైనా చూడండి కోపం వచ్చినప్పుడు ముక్కు దగ్గర వేలు పెట్టి చూసుకోండి, త్రాచుపాము బుస కొట్టినట్టు బుసకొట్టేస్తూ ఉంటారు మీరు, కోపం ఎవరికి వస్తుంది? గాలికి రాదు, మనసుకి వస్తుంది. కోపం మనసుకి వస్తే గాలి బుసకొట్టేస్తుంది. మీకు అర్థం అవుతుందా? అంటే ఏమిటి? ఆ తలంపు ప్రభావం వచ్చి గాలి మీద పడిపోతుంది. మనసు కుదురుగా ఉంది అనుకోండి గాలి కూడా కుదురుగా ఉంటుంది. భగవంతుడు మనకి రెండు శక్తులు ఇచ్చాడు. పని చేసుకునే శక్తి ప్రాణం ఇస్తుంది, ఆలోచించుకునే శక్తి మనస్సు ఇస్తుంది. రెండు శక్తులు పరమేశ్వరుడు మనకి ప్రసాదించాడు. ఈ రెండు శక్తులని సద్వినియోగం చేసుకుంటే మనకి మరుసటి జన్మ ఉత్తమ జన్మ వస్తుంది. వీటిని మనం సద్వినియోగం చేసుకోవాలి. మనస్సు తోటి ఆలోచించుకోవాలి. ప్రాణాన్ని దుర్వినియోగం చేసుకోకూడదు. ప్రతీ చిన్న విషయానికి కోపాలు తెచ్చుకోకూడదు, చిరాకులు తెచ్చుకోకూడదు. సహనం అవసరం. ఎప్పుడైతే ప్రాణశక్తి మీకు స్వాధీనంలోకి వస్తుందో, మీ ప్రాణశక్తే పరిణామంలో ఆధ్యాత్మిక శక్తిగా మారిపోతుంది. ప్రాణాయామం బాగా అభ్యాసం చేసిన వాళ్లకి కొన్ని మహిమలు కూడా వస్తాయి. ప్రాణశక్తి ఎప్పుడైతే మీకు స్వాధీనంలోకి వస్తుందో, మీ ప్రాణం ఎప్పుడైతే మీచేత నియమింపబడుతుందో, అప్పుడు మనస్సు కూడా మీకు తెలియకుండా మీ స్వాధీనంలోకి వచ్చేస్తుంది. మనస్సు స్వాధీనంలోకి వస్తే ప్రాణం స్వాధీనంలోకి వస్తుంది. ప్రాణం స్వాధీనంలోకి వస్తే మనస్సు స్వాధీనంలోకి వస్తుంది. అందుచేత మీకు ఎప్పుడైనా మనస్సు చిరాకుగా ఉంటే ప్రాణం కూడా బుస కొడుతూ ఉంటుంది. మనస్సు శాంతిగా ఉంటే ప్రాణం కూడా శాంతిగా ఉంటుంది. నేను చెప్పిన మాట మీరు అసత్యం అనుకోకండి. మీరు ఎప్పుడైనా శాంతిగా ఉన్నప్పుడు మీ ముక్కు దగ్గర చెయ్యి పెట్టుకుని చూసుకుంటే అప్పుడు ఎలా ఉంటుంది అంటే అసలు గాలి లోపలకి వెళుతోందా, లేదా అనిపిస్తుంది. అంటే తల వెంట్రుక ఎంత సన్నంగా ఉంటుందో, మీరు శాంతిగా ఉన్నప్పుడు అంత సన్నంగా గాలి లోపలకి వెళుతూ ఉంటుంది, బయటకి వస్తూ ఉంటుంది. మీరు కోపంగా ఉన్నప్పుడు మటుకు లోపల నుండి గాలి బుస కొడుతూ వచ్చేస్తూ ఉంటుంది. వాళ్ళిద్దరి అమ్మ ఒక్కటే.

ఎవరిద్దరికి? ఈ ప్రాణానికి, మనస్సుకి. స్థూలబుద్ధి ఉన్నవాళ్లకి ప్రాణాయామం మంచిది.

ఇంకో గంటలో మన శరీరం చనిపోతుంది అనగా, అప్పుడు మనస్సు అన్నీ సర్దుకోవటం ప్రారంభిస్తుంది. అంటే మనస్సుకి ఏవో ఒక గొడవలు ఉంటాయి కదా, ఆ జన్మలో ఏవో పనులు చేసి ఉంటాడు కదా వాడు మంచో, చెడ్డో, ఏవో పనులు చేసి ఉంటాడు కదా, నోటి తోటి ఏదో మాట్లాడి ఉంటాడు కదా, అవన్నీ జీవుడు సర్దుకుంటాడు. అవన్నీ సర్దేసుకున్న తరువాత నేను సర్దేసుకున్నానురా అని జెండా ఊపుతాడు. ఆ జెండా ఊపిన తరువాత ఈ ముక్కులో గాలి బయటకి వెళ్లిపోతుంది. అప్పుడు వాడు చచ్చిపోయాడు అని మనం అనుకుంటాం. అంటే గార్డ్ జెండా ఊపకుండా డ్రైవర్ కదలడు. మీకు అర్థం అవుతోందా? అదే విధంగా మనం చనిపోయే రోజున మన మనస్సు అన్నీ సర్దుకుంటుంది, నేను అన్నీ సర్దుకున్నాను నువ్వు బయటకి వెళ్లిపోవచ్చు అని. అప్పుడు ప్రాణానికి ఆర్డర్స్ ఇచ్చేస్తుంది. అప్పుడు ముక్కులో గాలి బయటకి పోతుంది. ప్రాణశక్తిని కూడా మనం సద్వినియోగం చేసుకోవాలి. ప్రాణశక్తిని వేస్ట్ చెయ్యకూడదు. మనం అనవసరమైన మాటలు మాట్లాడకూడదు. మనకి ఆధ్యాత్మికంగా ఉపయోగపడే పనులే చేతుల తోటి చెయ్యాలి, నోటి తోటి మాట్లాడాలి. ఏ విధంగా పని చేస్తే, ఏ విధంగా మాట్లాడితే మనకి చైతన్యస్థాయి పెరుగుతుందో, ఆ రకంగా పని చెయ్యాలి, ఆ రకంగా మాట్లాడాలి. ప్రాణశక్తిని మనం దుర్వినియోగం చెయ్యకూడదు, మానసికశక్తిని మనం దుర్వినియోగం చెయ్యకూడదు. భగవంతుడు మనకి ఇచ్చిన అవకాశాన్ని మనం సద్వినియోగం చేసుకోవాలి. సద్వినియోగం చేసుకుంటే higher బర్త్‌ని మనకి ప్రసాదిస్తాడు ఈశ్వరుడు.

ఆత్మ విచారణ చెయ్యమంటున్నారు, ధ్యానం చెయ్యమంటున్నారు, ప్రాణాయామం చెయ్యమంటున్నారు ఇవన్నీ చెయ్యమంటున్నారు రైటే, ఇంకా ఏమైనా సహాయపడే విషయాలు ఉంటే మాకు సెలవు ఇవ్వండి అంటున్నాడు ఈ భక్తుడు. అంటే భగవాన్ ఏమి చెబుతున్నారు అంటే శృతి వాక్యాలు, జ్ఞానుల బోధలు. జ్ఞాని ఎక్కడైనా బోధిస్తుంటే, జ్ఞాని చెప్పే మాటలని శ్రవణం చెయ్యండి. లేకపోతే జ్ఞాని మీకు ఎక్కడా దొరకకపోతే శృతి వాక్యాలు, ఉపనిషత్తులలో చెప్పిన మాటలు, భగవద్గీత చెప్పిన మాటలు, వేదం చెప్పిన మాటలని మీరు శ్రవణం చెయ్యండి.

అంటే బ్రహ్మానుభవం పొందిన వాడు ఏదైనా ఒక మాట చెబితే ఆ మాట మీరు శ్రవణం చెయ్యండి. రమణాచార్యుడు ఇక్కడ ఏమని చెబుతున్నాడు అంటే బ్రహ్మానుభవం పొందిన వాడు, ఆ బ్రహ్మం గురించి చెబుతుంటే నువ్వు శ్రద్ధగా విను. అటువంటి బ్రహ్మానుభవం పొందిన వాడు నీకు కనిపించకపోతే వేదం చెప్పిన మాటలు, ఉపనిషత్తులు చెప్పిన మాటలు, భగవద్గీత చెప్పిన మాటలు శ్రద్ధగా విని అర్థం చేసుకుని అనుభవంలోకి తెచ్చుకో, అంటే ఏదైనా మనం అధ్యయనం చేస్తున్నప్పుడు దానిని అర్థం చేసుకోవడం కూడా జ్ఞానం తోటి సమానమే. అది కూడా ఒక యోగం తోటి సమానమే. ఏదైనా ఒక సబ్జెక్టు మనం నేర్చుకుంటే సరిపోదు, దానిని అర్థం చేసుకోవాలి. దానిని అర్థం చేసుకుంటే అది కూడా యోగం తోటి సమానమే. అంటే పెద్దలు చెప్పిన మాటలను విను. పెద్దలు నీకు దొరకకపోతే, నువ్వు శృతి చెప్పిన మాట, వేదాలు చెప్పిన మాట, ఉపనిషత్తులు చెప్పిన మాట, నువ్వు శ్రద్ధగా శ్రవణం చెయ్యి. జ్ఞాని బోధ సంవాద రూపంలో ఉండవచ్చు లేకపోతే ఉపన్యాసం రూపంలో ఉండవచ్చు.

దక్షిణామూర్తి మౌనంగా కూర్చున్నారు, మాట వెండి, మౌనం బంగారం. రమణ మహర్షి గారిని ఏవైనా నాలుగు మాటలు చెప్పండి అంటే హృదయం హృదయం తోటి మాట్లాడేటప్పుడు మాటల తోటి పని ఏముంది? అనేవారు. అంటే చేసేవాడు చెప్పవలసిన పనేముంది? ఒక గంట ఇక్కడ ఉపన్యాసం చెబుతాను అనుకోండి, మీకు ఒక్క వాసన కూడా క్షీణించదు అనుకోండి, రమణమహర్షి గారు ఒక్క చూపు వల్ల, ఒక్క మాట వల్ల మీకు వాసనలు నశిస్తున్నాయి అనుకోండి, అప్పుడు మౌనం మంచిదా? ఉపన్యాసం మంచిదా? మీకు మొత్తం మీద రోగం తగ్గటం ముఖ్యం. మౌనం వల్ల మీకు రోగం తగ్గిపోతుంటే ఈ ఉపన్యాసాలు, ఈ బోధలు, ఈ డైలాగ్స్, ఈ టీచింగ్స్ అక్కర్లేదు. అయితే ఇవన్నీ అసలు పనికిరావు అని కాదు. ఇవన్నీ సెకండరీ. రమణమహర్షి గారు సర్వ సాధారణంగా మౌనంగానే ఉండేవారు. మౌనంగానే బోధించేవారు. మౌనం కూడా మాట్లాడుతుంది. మౌనం యొక్క సందేశం, మౌనం యొక్క టీచింగ్ అవగాహన చేసుకోవడానికి మనకి కొంత అర్హత ఉండాలి. మనం deserve అయ్యి ఉండాలి. మనం deserve అయ్యి ఉంటే గురువు మౌనంగా సందేశం చెప్పవలసింది ఏదో చెప్పేస్తాడు. అంటే

మౌనం కూడా బోధిస్తుంది. మౌనం కూడా మాట్లాడుతుంది. మీరు ఎప్పుడైనా మీ ఇంట్లో మీ ఆయన మీద కోపం వస్తే రెండు రోజులు మాట్లాడడం మానేస్తారు. అలాంటి మౌనం కాదు ఇది. మీకు అర్థం అవుతోందా? మాటలకి అందని మౌనం ఇది. అక్కడకి మనస్సు వెళ్ళలేదు, మాట వెళ్ళలేదు. మనస్సుకి అందని మౌనం ఇది. మాటకి అందని మౌనం. ఈ జ్ఞాన కెరటాలు, ఈ కాంతి కెరటాలు, కాంతి తరంగాలు, శాంతి తరంగాలు, ఆ మౌనం లోంచి ఉద్భవించి వస్తాయి అవి మిమ్మల్ని తడపటానికి. అవి మీ వాసనలని eliminate చేసి పడేస్తాయి. అవి మీ సంస్కారాలు అన్నిటినీ కాల్చి బూడిద చేస్తాయి. అందుచేత జ్ఞాని యొక్క బోధ మాటల రూపంలో ఉండక్కర్లేదు. ధ్యాన రూపంలో ఉండవచ్చు, అది మౌన రూపంలో ఉండవచ్చు. మౌనంలో ఉన్నప్పటికీ మౌనం కూడా మాట్లాడుతూ ఉంటుంది. అయితే అర్హత లేని వారు, యోగ్యత లేని వారు దానిని అందుకోలేరు. మౌనాన్ని అందుకుంటే మాటల తోటి పనే లేదు అసలు. పైకి అలా మౌనంగా వట వృక్షం కింద కూర్చుని, ఆ మౌనంగా కూర్చున్న ఆయనను చూసేటప్పటికే కొంతమందికి జ్ఞానం కలిగింది.

కొంతమంది ప్రశ్నలు రాసుకుని రమణమహర్షి గారి దగ్గరకు వెళ్ళి అడుగుదామని ఆయన సమక్షంలో కూర్చునేవారు కానీ వీళ్ళు అడగకుండానే సమాధానాలు వీళ్ళ హృదయంలో స్ఫురించేవి. అంటే ఆయన హృదయంలోనే ఉన్నాడు కదా, గురువు ఎక్కడ ఉన్నాడు? హృదయంలో ఉన్నాడు కదా, అందుచేత హృదయంలోనే స్ఫురించేవి. రమణమహర్షి గారి సమక్షంలో మన మైండ్ అనుకోకుండా అరెస్ట్ అయ్యిపోయేది. దాని wondering తగ్గిపోయేది. ఎవరి సమక్షంలో కూర్చుంటే మీ ప్రయత్నం లేకుండా, మీ సాధన లేకుండా మీ మనస్సు అణిగిపోతుందో, మీ మనస్సు శాంతిగా ఉంటుందో, మీ మనస్సు యొక్క wondering ఆగిపోతుందో వాళ్ళలో ఎంతో కొంత చైతన్యస్థాయి ఉందని గ్రహించండి అన్నారు రమణాచార్యుడు. జ్ఞాని యొక్క బోధ మౌనంలో ఉండవచ్చు, ఉపన్యాస రూపంలో ఉండవచ్చు, సంవాద రూపంలో ఉండవచ్చు అని చెపితే ఈ శిష్యుడు ఉండవచ్చా అని అడుగుతున్నాడు. జ్ఞాని యొక్క బోధ ఏ రూపంలో అయినా ఉండవచ్చును కానీ అవన్నీ రెండో పక్షం. అత్యంత ముఖ్యమైనది, అత్యంత ప్రధానమైనది అనుగ్రహం మాత్రమే. ఆయన బోధ చేసినా, లేకపోతే మాట్లాడినా, మాట్లాడక

పోయినా ఆయన అనుగ్రహం ముఖ్యం. గురువు యొక్క అనుగ్రహం ముఖ్యం. గురువు అంటే ఆత్మ, ఆత్మ అనుగ్రహం లేకుండా లేదు. ఆత్మ అనుగ్రహ స్వరూపమే. అగ్ని ఏ విధంగా అయితే వేడి లేకుండా ఉండదో, అలాగే ఆత్మ కూడా అనుగ్రహం లేకుండా ఉండదు. ఎందుచేత? దాని స్వరూపమే అనుగ్రహం. కాశీలో మరణిస్తే ముక్తి, అరుణాచలంలో మరణించక్కర్లేదు. అరుణాచలాన్ని స్మరిస్తే ముక్తి అన్నారు.

**అరుణాచల మనుచు స్మరియించు వారల యహము నిర్మూలింపు మరుణాచలా**

కాశీలో మరణిస్తే ముక్తి, అరుణాచలాన్ని స్మరిస్తే ముక్తి, అంటే రమణమహర్షి గారిని ఒక ప్లీడరు గారు అడిగారు. అరుణాచలాన్ని స్మరిస్తేనే మోక్షం వచ్చేస్తుందా? మోక్షం అంత తేలికగా ఉందా? అని. అడగడానికి నువ్వు ఎవరు? అది ఈశ్వరుడి ఆజ్ఞ అన్నారు రమణమహర్షి. గురువు అన్నా, ఆత్మ అన్నా, ఈశ్వరుడు అన్నా ఒక్కటే. గురువు అంటే ఆత్మే కాళ్ళు, చేతులు తొడుగుకుని వస్తుంది. వాడే గురువు. మనకి దేహబుద్ధి ఉంటుంది. మనకి దేహబుద్ధి ఉన్నప్పుడు మనకి ఎదుటివాడు దేహంగానే కనపడతాడు. దేహంగా కనపడితే కానీ మనం గుర్తించలేము. నేను ఎన్ని పుస్తకాలు చదివినా, ఎంత అధ్యయనం చేసినా, నాకు దేహబుద్ధి ఉన్నంత కాలం మీరు అందరూ ఆత్మ స్వరూపులు అయినా దేహాలు గానే కనిపిస్తారు. నాకు ఆత్మబుద్ధి కలిగితే అప్పుడు ఆత్మగానే కనిపిస్తారు మీరు అందరూ! మీకు అర్థం అవుతుందా? అందుచేత నాకు దేహబుద్ధి ఉన్నంత కాలం ఆత్మని నేను దర్శించలేను. ఆత్మానుభవం నాకు కలగదు. నాకు దేహబుద్ధి ఉన్నప్పుడు ఇతర మనుషులని కూడా దేహమే అనుకుంటాను నేను, ఆత్మ అనుకోను. నా దేహబుద్ధి తొలగించడం కోసం ఈ లోకంలో ఉన్నటువంటి సద్వస్తువే, ఆత్మే ఒక దేహం ధరించి వస్తుంది, అదే గురువు. ఆ



**అజ్ఞానం నిజంగా ఉంటే అది పోదు. అజ్ఞానం అనేది లేదు అసలు. నువ్వు ఎవరో నీకు తెలియకపోవటమే అజ్ఞానం. తెలిస్తే జ్ఞానం. అంతకంటే ఏమీ లేదు.**

బయట ఉన్న గురువు ఏమి చేస్తాడు అంటే మీకు చక్కగా బోధించి, మంచి మంచి మాటలు మీకు చెప్పి లోపలకు తోలుకుని వెళతాడు. నీ వాసనలు, నీ అలవాట్లు మనస్సును బయటకి తీసుకుని వచ్చేస్తూ ఉంటాయి.

గురువు దేహం ధరించి వచ్చి ఏ వాసన వల్ల, ఏ సంస్కారం వల్ల, ఏ అలవాట్లు వల్ల మన మనస్సు బయటకి విజృంభిస్తుందో చూసి ఆ అలవాట్ల నుంచి మనల్ని తప్పించి, ఆ బలహీనతలలోంచి మనల్ని తప్పించి, మనలను లోపలకి తోలుకుని వెళతాడు. నిజమైన గురువు ఎక్కడ ఉన్నాడు? లోపల ఉన్నాడు కదా, బయట ఉన్న గురువు ఏమి చేస్తాడు అంటే, మనకు మంచి మాటలు చెప్పి, మనలను లోపలకు గెంటి లోపల గురువుకి మన జుట్టు అందిస్తాడు. లోపల గురువు ఉన్నాడు కదా, వాడు మన జుట్టు పట్టుకుని లోపలకు లాగేస్తాడు. వాడు లోపలకు లాగేసి మన జీవ లక్షణాలు అన్నీ పోగొట్టేసి మన స్వరూపాన్ని మనకి ఇస్తాడు అదే మన కడసారి జన్మ. అది ఫైనల్ స్టేట్, అది సుప్రీం స్టేట్, అది సుప్రీం రియాలిటీ. ఆ స్టేట్ మనం పొందే వరకు ఈ ప్రకృతి మనలని విడిచి పెట్టదు. ఏ మార్గంలో మీరు ప్రయాణం చేసినా ప్రకృతిని దాటి వెళ్ళాలి. సుప్రీం స్టేట్ మీరు పొందితే కానీ ప్రకృతి మీకు దారి ఇవ్వదు. మాయ మీకు దారి ఇవ్వదు. మాయ మీది కాదు, నాది కాదు ఈశ్వరుడిది. అందుచేత ఈశ్వరుడి అనుగ్రహం మనకి లేకపోతే మాయ మనకి దారి ఇవ్వదు. మాయ మనకి దారి ఇస్తేనే కానీ ఆ సుప్రీం స్టేట్ మనం పొందలేము. ఆ సుప్రీం స్టేట్ మనం పొందితేనే కానీ లిబరేషన్ కూడా మనకి అందదు. ఆ స్థితి పొందటానికి గురువు అనుగ్రహం చాలా ముఖ్యం.

నేను సాధన చేస్తున్నాను, ఆ సాధన చెయ్యడం వలన ఆత్మలాభం ఎప్పటికి వస్తుంది అని ఈ భక్తుడు అడుగుతున్నాడు అది తెలుసుకోవడం వల్ల నీకు ప్రయోజనం ఏమిటి అంటున్నారు భగవాన్. ఆదివారమో, సోమవారమో ఎప్పుడో ఒకప్పుడు వస్తుంది. నువ్వు చేసే పని మీద నీ మనస్సుని పెట్టు. ఆదివారం వస్తుందా, సోమవారం వస్తుందా ఆ గొడవ ఎందుకు? నువ్వు చేసే పని మీద, నువ్వు చేసే సాధన మీద, నీ మనస్సుని మినహాయింపులు లేకుండా, పూర్తిగా నీ మనస్సుని అక్కడ పెట్టు. అంతేకానీ ఫలితం కోసం ఎదురు చూడకు.

నువ్వు ఎదురు చూసినా, చూడకపోయినా వచ్చేది ఏదో వస్తుంది. అందుచేత నువ్వు సాధన యందే నీ మనస్సు పెట్టు. అది ఎప్పడో ఒకప్పుడు వస్తుంది. ఫలితం అనేది నీ చేతిలో లేదు. ఈశ్వరుడి చేతిలో ఉంది. ఎప్పడు ఇవ్వాలో, ఎక్కడ ఇవ్వాలో, ఎలా ఇవ్వాలో ఆయనకి తెలుసు. నువ్వు కంగారు పడకు, ఆయనకి నువ్వు జ్ఞాపకం చెయ్యక్కర్లేదు. మీకంటే తెలివి కలవాడే, మీకంటే ఎక్కువ జ్ఞాపక శక్తి ఉన్నవాడే ఈశ్వరుడు. ఎప్పడు ఇవ్వాలో ఆయనకి తెలుసు. నీ చేతిలో ఉన్న పని ప్రీతిగా చెయ్యి, ప్రేమగా చెయ్యి, ఇష్టంగా చెయ్యి, సమగ్రంగా చెయ్యి, వెలితి లేకుండా చెయ్యిఅని చెబుతున్నారు భగవాన్. నువ్వు చేసే సాధన మటుకి ప్రీతిగా చెయ్యి అంతేకానీ ఫలితం expect చెయ్యక్కర్లేదు. ఒకొక్కసారి expectation వల్ల disappointment వస్తుంది. Expectation ఎవడికైతే లేదో వాడికి disappointment కూడా ఉండదు. అందుచేత నువ్వు చేసే పని ఏదో శ్రద్ధగా చెయ్యి అన్నారు.

ఒక్క విషయం మీరు జ్ఞాపకం ఉంచుకోండి. ఈ ఆత్మానుభవం కలగడం కోసం ఆత్మ విశ్వాసం ఉండాలి, ధైర్యం ఉండాలి. ధైర్యం లేనివాడు ఏమిచెయ్యలేడు. కఠోపనిషత్తులో చెప్పారు బలహీనులకి, బద్ధకస్తులకి ఆత్మానుభవం కలగదు అని. మనకి ఆత్మానుభవం కలగాలి అంటే ముందు మన మీద మనకి విశ్వాసం ఉండాలి. ధైర్యం ఉండాలి. అందుచేత అభయస్థితి ఎక్కడ ఉంది అంటే, ఒక్క మోక్షంలోనే అభయస్థితి ఉంది. రమణమహర్షి గారి శరీరం పడిపోయే రోజున కొంతమంది భక్తులు ఏమన్నారు అంటే మీరు వెళ్ళిపోతున్నారు, మేము ఉండిపోతున్నాము అన్నారు. అప్పడు రమణమహర్షి గారు ఏమన్నారు అంటే నేను వెళ్ళిపోతున్నాను అంటున్నారు నాకు వెళ్ళడానికి చోటు ఎక్కడ ఉంది? అన్నారు. ఆత్మ అంతటా ఉంది, చైతన్యం అంతటా ఉంది. అంతటా ఉన్నప్పుడు వాడు ఎక్కడకి వెళతాడు? I am not going away, I am here. నేను ఎక్కడకి వెళ్ళడం లేదు. అంతటా ఉన్నాను, ఇక్కడా ఉన్నాను, అక్కడా ఉన్నాను, అంతటా ఉన్నాను. ఇక్కడ ఉండి అక్కడ లేకపోతే అక్కడకి వెళ్ళడం అనే సమస్య ఉంటుంది. నేను ఎక్కడకి వెళ్ళడం లేదు, I am not going away. ఆత్మ అంతటా ఉంది, అంతటా ఉన్న వస్తువుకి వెళ్ళడం ఏమిటి, రావడం ఏమిటి? ఇవన్నీ జీవ లక్షణాలు. అంటే వాళ్ళు శరీరం ధరించడం కూడా అనుగ్రహం వల్లే! ఒక ఇంగ్లాండు

దేశస్థుడు రమణాచార్యుడితో “ఏవండీ దేశం కాని దేశం వచ్చాం. మా బంధువులని, మా ఆస్తులని విడిచిపెట్టి మీ దగ్గరకి వచ్చాం. ఇప్పుడు మీరు మమ్మల్ని విడిచి పెట్టి వెళ్ళిపోతున్నారు” అని అన్నాడు. అప్పుడు భగవాన్ ఏమి చెప్పారు అంటే, పూర్వ జన్మల్లో ఏమీ సంబంధం లేకుండానే మనం ఇక్కడ కలుసుకున్నామా? ఈ సంబంధం మనల్ని మరొక చోట కలపదా అన్నారు. అంటే ఏమిటి వాడికి బ్రహ్మానుభవం కలిగేవరకు గురువు ఏదో ఒక రూపంలో శరీరం తొడుగుకుని వస్తూనే ఉంటాడు. వాడిని విడిచిపెట్టే సమస్య లేదు. సత్యం ఎక్కడ ఉంది అంటే, మీ హృదయంలోనే ఉంది. అందుచేత నీ హృదయంలో ఉన్న ఆ నిర్మలమైన వస్తువు, ఆ సత్య వస్తువు, అది నీకు అనుభవంలోకి వచ్చిన తరువాత అప్పుడు నువ్వు లోకాన్ని చూడు. రమణమహర్షి గారు ఒక మాట చెప్పారు. ఈ లోకానికి నువ్వు అత్యంత ఉపకారం చెయ్యాలి అనుకుంటే, ఈ లోకానికి నువ్వు ఉపయోగపడాలి అనుకుంటే, నువ్వు ముందు జ్ఞానాన్ని సంపాదించు. నువ్వు జ్ఞానం సంపాదిస్తే నువ్వు సమాజానికి ఉపయోగపడాలి అనుకున్నా, అనుకోకపోయినా నీ ద్వారా లోకానికి ఉపకారం జరుగుతూనే ఉంటుంది. ఎవడికైతే జ్ఞానం కలిగిందో, ఎవడికైతే బ్రహ్మానుభవం కలిగిందో, ఆ సత్య దర్శనం ఎవడికైతే కలిగిందో, వాడు అనుకోడు నేను చేస్తున్నాను అని, వాడి ద్వారా పని జరుగుతుంది, వాడి ద్వారా ఈ లోకం ఉద్ధరించబడుతుంది.

యేసుక్రీస్తు చెప్పాడు ఉప్పు లేని పప్పు ఎలా ఉంటుందో, జ్ఞాని లేని సమాజం కూడా అలాగే ఉంటుంది అని. పప్పుకి ఉప్పు ఎటువంటిదో సమాజానికి జ్ఞానులు కూడా అటువంటి వాళ్ళే. వాళ్ళ అవసరం ఉంటుంది. శృతి , జ్ఞాని చెప్పిన మాట, వేదం చెప్పినటువంటి మాటని మీరు శ్రద్ధగా శ్రవణం చేసి, అర్థం చేసుకుని, అనుభవంలోకి తెచ్చుకోవడానికి ప్రయత్నం చెయ్యండి అని చెప్పారు. జ్ఞానిని మనం చూస్తున్నప్పుడు మనకి కూడా inspiration కలుగుతుంది మనం కూడా జ్ఞానం సంపాదించుకోవాలి అని, మహాత్ముల యొక్క దర్శనం వల్లే మనకి ఆ inspiration వస్తుంది. మహాత్ములని దర్శించడం వల్ల ఎంతో కొంత లాభాన్ని మనం పొందుతాము. అది భౌతికంగా ఉండనివ్వండి, అభౌతికంగా ఉండ నివ్వండి, లౌకికంగా ఉండనివ్వండి, అలౌకికంగా అవ్వనివ్వండి. ఏదో రకంగా మనం

మహాత్ములని దర్శించడం వల్ల, తప్పనిసరిగా ఆ బ్రహ్మానుభవం మనకి కలగడానికి అవకాశాలు కలుగుతాయి. రమణమహర్షి గారు చెబుతూ ఉంటారు మీరు షాపుకు వెళ్ళి బట్టలు కొనుక్కోండి అని డబ్బులు మీకు ఇవ్వడు జ్ఞాని అంటే వాడే బట్టలు కొంటాడు, వాడే నీ ఆది చూస్తాడు. వాడే కుట్టించి నీ చేతికి ఇస్తాడు. మీకు అర్థం అవుతోందా? అంటే జ్ఞాని కేవలం సాధన చేసుకోమని మీకు చెప్పటమే కాకుండా, మీకు జ్ఞానానుభవం కలగడానికి కూడా జ్ఞాని బాధ్యత వహిస్తాడు. అన్ని విధాల సహాయ సహకారములు అందిస్తాడు. అంటే జ్ఞాని యొక్క ప్రేమ మన మీద ఎంత అద్భుతంగా ఉంటుందో, ఎంత వండర్ఫుల్‌గా ఉంటుందో చూడండి. అది naturalగా ఉంటుంది, ఏదో కారణం వల్ల వచ్చినది కాదు. నిజమైన భక్తికి కారణం ఉండదు. నిజమైన ప్రేమకి కారణం ఉండదు. మనకి ఈశ్వరుడి మీద ప్రేమ ఉండాలి, కారణం కనిపించకూడదు. ఈశ్వరుడి మీద భక్తి ఉండాలి, కారణం కనిపించకూడదు. ఈ అకారణ భక్తి, ఈ అకారణ ప్రేమ ఎప్పుడైతే మనకి ఈశ్వరుడి మీద కలిగిందో, ఆయన స్వరూపమే జ్ఞానం కాబట్టి, జ్ఞానంతోటి మనలని అలంకరిస్తాడు. ఈ జన్మలోనే ఇప్పుడే అలంకరిస్తాడు. ఎప్పుడో, ఎక్కడో కాదు. మన సాధన యొక్క intensity బట్టి ఈ జన్మలోనే, ఇప్పుడే అలంకరిస్తాడు. మన బలహీనతలు ఏంటో భగవంతుడికి తెలుసు. మన గురువుకి తెలుసు. మనకు సాధన చేసే inspiration కూడా లోపల నుంచి ఆయనే కలుగజేస్తూ ఉంటాడు. మారు మనస్సు ఆయనే కలుగజేస్తూ ఉంటాడు. మారు మనస్సు వస్తేనే కానీ మనం ఆ దురలవాట్ల నుంచి బయట పడలేము. మరణం గురించి కూడా మనం ఎవరం భయపడనక్కర లేదు. మరణం అంటే మార్పు, మరణం వల్ల ఏమి వస్తుంది మనకి? మార్పు వస్తుంది. ఏమి మార్పు వస్తుంది? మరణం వల్ల పాత దేహం పోతుంది, కొత్త దేహం వస్తుంది. ఎప్పుడైతే కొత్త దేహం వచ్చిందో అప్పుడు కుటుంబం మారిపోతుంది. ఆ కొత్త కుటుంబంలో, ఆ కొత్త పరిసరాలలో, ఆ కొత్త బంధువులలో, ఆ కొత్త స్నేహితులలో మన చైతన్య స్థాయి పెరగవచ్చు. మరణం అంటే మనకు మార్పు తీసుకుని వస్తుంది. పాత దేహం పోతుంది, కొత్త దేహం వస్తుంది. ఎటువంటి కుటుంబంలో నువ్వు పుడితే నీ ఆధ్యాత్మిక సాధన అభివృద్ధి అవుతుందో మరణం ద్వారా అటువంటి కుటుంబంలోకి పరమేశ్వరుడు నీకు transfer పెట్టవచ్చు, అందుచేత మరణం అంటే ఎవరు భయపడనక్కరలేదు.



# శ్రీమద్భగవద్గీత

**(సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహ భాషణముల నుండి)**

**బుద్ధ్యా విశుద్ధయా యుక్తో ధృత్యాత్మానం నియమ్య చ ।**
**శబ్దాదీన్ విషయాన్ త్యక్త్వా రాగద్వేషౌ వ్యుదస్య చ ॥ 18-51 ॥**

**తాత్పర్యము :** విశుద్ధమైన బుద్ధిగలవాడై, సాత్త్వికధారణాశక్తి ద్వారా అంతఃకరణము ఇంద్రియముల సంయమమును కలిగి, శబ్దాది విషయములను త్యజించి, రాగద్వేషములను సర్వదా త్యజించవలెను.

నీ బుద్ధిని శుద్ధి చేసుకో, విశుద్ధ బుద్ధి అంటే శుద్ధబుద్ధిని సంపాదించు అంటున్నారు వాసుదేవస్వామి. విషయాన్ని తొందరగా గ్రహించే శక్తి ఉండాలి. పరమేశ్వరుడిని ప్రార్థించగా ప్రార్థించగా తెలివిని మంచిబుద్ధిని ప్రసాదిస్తాడు. అంటే ఆ డిస్క్రిమినేషన్, మంచి చెడ్డ విభజించుకొనే బుద్ధిని భగవంతుడే మనకి ప్రసాదించాలి. మనిషికి ధైర్యం ఉండాలి. ధైర్యం లేకుండా నువ్వు ఏదీ సాధించలేవు. మనకి ధైర్యం లేకపోతే, పట్టుదల కనుక లేకపోతే, శరీరాన్ని కానీ, ఇంద్రియాలని కానీ, మనస్సుని కానీ స్వాధీనం చేసుకోలేము. పిరికివాడు ఏమీ సాధించలేడు. అందుచేత ఇవన్నీ నియమంగా పెట్టుకో అంటున్నాడు.

కొంతమందికి లోకవాసన, శబ్దాల గొడవ ఎక్కువగా ఉంటుంది. చెయ్యి కడుక్కోగానే పక్కింటికి వెళ్లిపోయి, అక్కడ ఏంజరిగింది ఇక్కడ ఏం జరిగింది అని చెప్పకుంటారు. ఎక్కడ ఏం జరిగితే వీళ్లకెందుకు. అసలు ఎక్కడ ఏం జరిగినా అది అబద్ధమే. లోకమే అసత్యమని, శరీరానికి లోకానికి అహంకారానికి అతీతంగా ఒక పరతత్త్వం ఉందని, అనుభవం లేనిమూలాన ఈ లోకం గొడవలన్నీ చెప్పకుంటారు. లోకవాసన ఉన్నవాళ్ళు ఆ లోకం ఒక్కటే నిజం అనుకుంటారు. ముందు ఆ శబ్దాన్ని నిగ్రహించండి.

కొంతమందికి దేశంలో అన్ని గొడవలు కావాలి, వాళ్ళకి అదే ఆహారం. కానీ దేశంలోని వాళ్ళు బాగుపడుతున్నారో లేదో వాళ్ళకి అక్కరలేదు. ఇక్కడి మాటలు అక్కడ చెప్పటం, అక్కడి మాటలు ఇక్కడ చెప్పటం, కలహప్రియులు అంటారు వాళ్ళని. బుద్ధుడికి ఈ లోకం గొడవలు వినటము, ఈ శబ్దము, ఈ స్పర్శ, ఈ రూపము, ఇటువంటి గొడవలు అసలు లేవు. మనుషులు ఎటువంటి వాళ్ళంటే, వాళ్ళకి ఇష్టం ఉంటే ఒకరకంగా చెపుతారు, ఇష్టం లేకపోతే ఒకరకంగా చెపుతారు. వాళ్ళకి ఇష్టం అయితే రావణాసురుడిని కూడా రాముడు అంటారు. రాముడు అంటే ఇష్టం లేకపోతే, రాముడిని రావణాసురుడు అంటారు. ఇటువంటి గొడవలు వద్దు. వింటే భగవంతుడు చెప్పేది వినాలి, లేకపోతే ఋషి చెపితే వినాలి కానీ ఈ మాటలు వినటం అనవసరం.

ఇతరుల గొడవ మనకెందుకు? వాళ్ళ స్నేహాలు పడితే పాడైపోతాము అనుకున్నప్పుడు వాళ్ళకి దూరంగా ఉంటే సరిపోతుంది. అలాగని వాళ్ళని విమర్శించకూడదు, వాళ్లమీద ద్వేషబుద్ధి ఉండకూడదు. ద్వేషబుద్ధి ఉంటే మనం పాడైపోతాము. అందుచేత ఊరికే దూరంగా ఉంటే సరిపోతుంది. వాళ్లేదైనా అక్కరలేని గొడవలు చెపితే వాళ్ళ మాటలు విన్నాకాని వాటిని పట్టించుకోకుండా లోపల మనస్సులోకి తీసుకోకుండా ఉంటే సరిపోతుంది. ఆ మాటలు మనం లోపలికి తీసుకుంటే మనస్సు విషపూరితం అవుతుంది. ఈ రూపం ఒకటి, స్పర్శ ఒకటి, శబ్దాలు ఒకటి, వీటికి దూరంగా ఉండాలి. వీటి నుండి విడుదల పొందటానికి సాధన చెయ్యాలి. మనస్సులో రాగద్వేషాలు పుట్టనివ్వకూడదు. రాగద్వేషాలు, కామక్రోధాలు, ఇష్టాలు అయిష్టాలు, ఇవన్నీ జంటలు. మలమూత్రాలు ఎటువంటివో, ఇవి కూడా అటువంటివే. రాగం ఉన్నా మీ మనస్సు బహిర్ముఖం అవుతుంది, ద్వేషం ఉన్నా బహిర్ముఖం అవుతుంది. ఇంకొకటి అర్థం చేసుకోండి. ఒక మనిషిని ద్వేషించటానికి బాహ్యంగా మీకు తగిన కారణాలు ఉండొచ్చు, మీరు అనుకున్న కారణాలు కూడా నిజం అయ్యి ఉండవచ్చు. అయినప్పటికీ మీకుఅక్కడ ద్వేషబుద్ధి కలగకుండా ఉంటే, అప్పుడు భగవంతుడి దయకి పాత్రులు అవుతారు. అది గుర్తుపెట్టుకోండి.

ఇంట్లోవాళ్ల పట్ల కూడా మనం డ్యూటి చెయ్యాలి కానీ, ఎవరి గురించి బెంగపెట్టుకోకూడదు. మన శరీరానికి ప్రారబ్ధం ఎలా ఉందో, ఇంట్లో వాళ్ళ శరీరాలకి కూడా ప్రారబ్ధం ఉంటుంది. మనం ఏదైనా మంచి చెప్పవచ్చు. కాని వాళ్ళ దేహప్రారాబ్ధాన్ని బట్టి వాళ్ళు ఉంటారు, మన దేహప్రారాబ్ధాన్ని బట్టి మనం ఉంటాము. అంచేత కుటుంబసభ్యుల పట్ల కూడా డ్యూటి చెయ్యాలి కాని అటాచ్‌మెంట్ పెట్టుకోకూడదు. ఇట్ ఈజ్ అటాచ్‌మెంట్ దట్ బ్రింగ్స్ అజ్ మిసరీ, ఇట్ ఈజ్ అటాచ్‌మెంట్ దట్ బ్రింగ్స్ అజ్ డెత్, ఇట్ ఈజ్ అటాచ్‌మెంట్

దట్ బ్రింగ్స్ అజ్ సారో, ఇట్ ఈజ్ అటాచ్‌మెంట్ దట్ బ్రింగ్స్ అజ్ ఎవ్రీథింగ్ దట్ ఈజ్ నాన్సెన్స్!
(It is attachment that brings us misery, it is attachment that brings us death, it is attachment that brings us sorrow, it is attachment that brings us every thing that is nonsense.)

మీకు సృష్టిలో ఎక్కడా మమకారం లేదనుకోండి, అటాచ్‌మెంట్ లేదు అనుకోండి, మీ మనస్సుని కదలమని అడిగినా కదలదు. మనోనిగ్రహానికి మీరు సాధన చెయ్యక్కరలేదు. అసలు మీకు సాధనతోటి పనిలేకుండా మీ మనస్సు హృదయములోకి వెళ్ళి అణిగిపోతుంది. మీకు ఎక్కడ మమకారం ఉంటే అక్కడికి మనస్సు పరుగుపెడుతుంది. ఎక్కడా మమకారం లేకపోతే దానికి కదలవలసిన పని లేదు. మీ మనస్సు ఎక్కువ చలిస్తోంది అంటే మీకు ఎక్కడో మమకారం ఉంది. శరీరానికి జ్వరం వస్తే ఎక్కడో దోషం ఉందని అర్థం. ఏదో కారణం లేకుండా జ్వరం రాదు. అలాగే మీ మనస్సు చలిస్తూ ఉంటే దానికి ఏదో కారణం ఉండాలి. దానికి ఎక్కువ మమకారమే కారణం. అంచేత మీకు ఎక్కడైనా ఇష్టం ఉన్నా, అయిష్టం ఉన్నా మనస్సు చలిస్తుంది, అక్కడికి వెళ్ళిపోతుంది. అర్జునా! నువ్వు సాధన చేసి, ఏకాంతవాసం చేసి. సత్పురుష సహవాసం చేసి, సద్గ్రంథాలు అధ్యయనం చేసి, తరువాత నువ్వు జపతపాలు చేసి, ధ్యానాలు చేసి, ముందు ఈ రాగద్వేషాల లోనుంచి బయటికి రావటానికి ప్రయత్నం చెయ్యి. నీ శక్తివంచన లేకుండా నువ్వు ప్రయత్నం చేస్తే, నువ్వు చేసే ప్రయత్నమే నా దయ కింద మారిపోతుంది. వస్తుందో రాదో అని కంగారు పడొద్దు. మీరు చేస్తున్న ప్రయత్నమే నా అనుగ్రహం కింద మీకు మారిపోతుంది. మీ చేతిలో ఉన్న పని మీరు చేయండి, నా చేతిలో ఉన్న పని మీరు జ్ఞాపకం చేయకండి, నా చేతిలో ఉన్న పని నేను చేస్తాను అర్జునా, అని చెపుతున్నాడు.


## రమణ భాస్కర చందాదారులకు విన్నపం

**రమణ భాస్కర శాశ్వత చందా (10 సం॥లకు) రు॥ 1200/-లు**. రమణ భాస్కర శాశ్వత చందాదారులుగా చేరి పత్రికను ప్రోత్సహించవలసినదిగా కోరుచున్నాము.

**సంవత్సర చందా రు॥ 150/-లు**. సంవత్సర చందాదారులకు చందా గడువు ముగిసినది. మీ చందాను స్వయంగా గానీ లేక

**శ్రీ రమణక్షేత్రం, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, యడ్ల బజార్, పాలకొల్లు బ్రాంచి** అకౌంట్ నెంబర్ **520101264185724 (IFSC Code : UBIN0827533)** నందు గాని చెల్లించగలరు. చందాను **బ్యాంక్ అకౌంట్‌లో జమచేసినవారు** జమచేసిన తేదీ, వారి అడ్రసును **9866715896** ఫోన్ నెంబరుకు తెలియపరచగలరు.

**శ్రీ రమణ క్షేత్రం, జిన్నూరు - సెల్ : 98485 23805**

SRI RAMANA KSHETRAM A/c. No. **6794857762**
**INDIAN BANK, VEDANGIPALEM BRANCH**
IFSC Code : **IDIB000V142, Contact No. 9866715896**

# అరుణాచల ప్రయాణం

ఆగష్టు నెల అనగానే రమణభక్తులకు ఆనాటి వేంకటరామన్ (తరువాత కాలంలో భగవాన్ శ్రీరమణమహర్షి) మధురైను విడిచిపెట్టి అరుణాచల క్షేత్రం చేరిన స్మృతులు గుర్తుకొస్తాయి. జూలై 16, 1896న మధురైలో అమృతానుభవం పొందిన తరువాత వేంకటరామన్ వైఖరి పూర్తిగా మారిపోయింది. ఇష్టాయిష్టాలు, తిండిపై ధ్యాస, చదువుపై ధ్యాస అన్నీ తగ్గిపోయాయి. ఏ పని చేస్తున్నా తనలోని దివ్యత్వం (నిజమైన నేను) తనను నడిపిస్తోందని అనుభవైకవేద్యం అయింది. ఇలా ఆరు వారాలు గడిచింది. వేంకట రామన్‌లో చోటుచేసుకున్న మార్పులను గమనించిన అన్నగారు సరిగా చదువుమీద శ్రద్ధ పెట్టటం లేదని మందలించడం, నీబోటి వాడికి ఇంటి వద్ద పని ఏముంది? అని అనడం, అరుణాచలం తనను నిద్ర లేపినట్లు అయింది. ఇక లాభం లేదు, తన పరమ గమ్యమైన తిరువన్నామలై వెళ్లిపోవాలి. ఆ రోజు ఆగష్టు 29, 1896 మధ్యాహ్నం 12 గంటలైంది. హడావిడిగా రైల్వే స్టేషనుకు నడిచాడు, ఆరోజు ఆ రైలు ఆలస్యంగా వచ్చింది. రైలు ఎక్కి ఆత్మలో విలీనమై కాలం గడిపాడు. తెల్లవారితే 30వ తేదీ, విల్లుపురంలో రైలు దిగిపోయాడు. అక్కడ నుండి మరో రైలు ఎక్కి మాంబళంపట్టు చేరాడు. అక్కడికి తన గమ్యం ఇంకా 30 మైళ్ల దూరం, అంత దూరం నడవక తప్పదు, చేతిలో డబ్బు లేదు. చీకటి పడే సమయానికి అరయనల్లూరు దేవాలయానికి చేరుకున్నాడు. అటుపిమ్మట అక్కడికి దగ్గరలోనే ఉన్న కీలూర్ దేవాలయానికి చేరుకున్నాడు. అప్పటికీ ఆయనకు చాలా ఆకలిగా ఉంది. వేంకటరామన్ దైన్యం, తీరుతెన్నులు గమనించిన డోలు వాద్యకారుడు తన వంతు ప్రసాదాన్ని వేంకటరామన్‌కి పెట్టాడు. అది తీసుకుని మంచి నీళ్ళు త్రాగడానికి బావి దగ్గరకు పోతూ కళ్ళు తిరిగి పడిపోయాడు. చేతిలోని ప్రసాదం నేలపాలైంది. కళ్ళు విప్పేటప్పటికి చుట్టూ జనం, ఎవరో నీళ్ళు ఇవ్వగా త్రాగి క్రింద పడ్డ ప్రసాదం ఏరుకుని తిని నేలపై పరుండిపోయాడు. ఆరాత్రి వేంకటరామన్ యొక్క దీన స్థితిని చూచి రాళ్ళు సైతం కన్నీరు కార్చాయి. ఆ మరునాడు ఆగష్టు 31 గోకులాష్టమి. శ్రీ ముత్తు కృష్ణ భాగవతార్ ఆయనకు చక్కటి విందు భోజనం పెట్టారు. తన చెవి కమ్మలను ముత్తు భాగవతార్ వద్ద తాకట్టు పెట్టి ఐదు రూపాయలు తీసుకున్నాడు. ఆ రాత్రి రైల్వే స్టేషనులోనే పడుకుని, తెల్లవారుఝామున రైలు ఎక్కి 1896 సెప్టెంబరు 1న ఉదయం 6 గంటలకు తిరువన్నామలైలో రైలు దిగి నేలపై కాలు మోపగానే, తనువెల్లా ఒక్కసారిగా పులకించింది. శరీరంలో విద్యుత్ ప్రవహించినట్లు అయింది. చుట్టూ చూసాడు, అది తన దివ్యలోకం. తిన్నగా అరుణాచలేశ్వరుని ఆలయంలోకి ప్రవేశించి, తన్ను తాను సమర్పించుకున్నాడు. ఏబది నాలుగు సంవత్సరములు అరుణాచల క్షేత్రం కేంద్రంగా ప్రపంచానికి జ్ఞానబోధను అందించారు. ఆ జ్ఞానబోధ నిరంతరం కొనసాగుతూనే ఉంది. అట్టి తన గురువైన భగవాన్ శ్రీరమణుని మనందరికీ పరిచయం చేసి, వారి సందేశమును మనకు అందించిన సద్గురు శ్రీనాన్నగారికి మనము ఎల్లప్పడూ ఋణపడి ఉంటాము.

**- చావలి సూర్యనారాయణమూర్తి, అమలాపురం, సెల్ : 9963195064**

# వాదం అజ్ఞానాన్ని ప్రదర్శిస్తుంది - విచారణ విజ్ఞానాన్ని అన్వేషిస్తుంది

విద్యావంతులైన వారిలో చాలామంది అసందర్భమైన విషయాలలో చిక్కుకుంటారు. భగవంతుణ్ణి బుద్ధితో తెలుసుకోవటం సాధ్యమనుకొంటారు. దానికి సంబంధించిన రుజువులు కోరుకొంటారు. గీత అంతా కంఠస్తం చేసినా, ఉపనిషత్తులు అన్నీ భాష్యంతో చెప్పినా, బ్రహ్మసూత్రాల సమన్వయం చేసినా అది అంతా పాయసంలో గరిటె లాంటిది. గరిటెకి పాయసం అనుభూతి ఎలా తెలుస్తుంది. అంతరంగమైన సత్యానుభవం లేశమైనా లేనప్పుడు ఇది అంతా అజ్ఞానం యొక్క అజ్ఞానం. అనేక ముఖాలుగా ప్రసరించే మనస్సు సత్యాన్ని గ్రహించలేదు. కొందరు పండితులు మిగతావారిని అవివేకులుగాను, మూఢులుగాను జమకడతారు. రామకృష్ణులు "పసిపిల్లలవంటి స్వభావం గలవారే పరమాత్మను చేరుకొంటారు. మేధాశక్తికి పాండిత్యానికి తావు ఎక్కడ. మానవుడు తన అజ్ఞానాన్ని చాతుర్యాన్ని విడనాడాలి వారు తర్కానికి దిగుతారు, వాద వివాదాల్లో దిగుతారు వారికి అడుగడుగునా ఆటంకాలే. ప్రభువు అదృశ్యుడు, అగోచరుడు అని అనుకొనేవానికి ఏమీ లభించదు. ప్రభువు గోచరుడు అని ఘంటాపదంగా చెప్పి ఆచరించినవారు చాలా మంది ఉన్నారు. శోధించి ప్రయత్నం చెయ్యకపోతే తప్పు ఎవరిది? రోగాన్ని పోగొట్టుకోవాలంటే రోగి మందు వాడాలి, పత్యం చెయ్యాలి. వేరొకరు మందు వాడితే పోదు. అలాగే ఆత్మానుభవానికి స్వయంకృషి, గురు కటాక్షం కావాలి. అనంతమైన పరబ్రహ్మ జ్యోతి అభిముఖమైనప్పుడే నిజమైన విద్య ప్రారంభమౌతుంది. విజ్ఞాన వాహిని వెల్లువిరుస్తాయి" అన్నారు. అంతేగాని గ్రంథాల్లోని విషయాలను ఆ ఎంగిలి ముక్కలతో ఎవరినీ ప్రభావితం చెయ్యలేరు. విద్యావంతులు భగవంతుని ఇంట కాపలాదార్లు వారు స్వయంగా లోపలికి వెళ్లలేరు ఏ భక్తుడైనా వెళ్లానంటే నమ్మరు. అస్పష్టత సత్యానికి అడ్డుకట్ట. వాదాలు విభజిస్తాయి. విభజనకు సులభోపాయం వాదం. ప్లేటో "పాఠశాలలు, కళాశాలల్లో బోధించేది విద్యకాదు అసలు విద్యకు అది ఒక సాధనం మాత్రమే. తన్ను తాను జయించిన వానికి కవిత్వ కవాటాలు తెరుచుకుంటాయి" అన్నారు. నా కవిత్వం నా ప్రసంగం బాగుండాలని ఆనందించేవాడికి సామర్థ్య స్థితిలో ఉండలేడు లేదా వ్రాస్తున్నాను అనే దేహ స్తుతి ఉన్నంతకాలం వ్రాయలేడు. వేద రహస్యాలు గ్రహించనివారు కన్నులుండి గ్రహించలేరు. రమ్యమైన వస్త్రం ధరించిన భార్య తన భర్తకు మాత్రమే తన శరీరాన్ని చూపుతుంది. అలాగే వేద సత్యం విశ్వసించి, ఆకాక్షించి కోరే భక్తాగ్రేసరులకే గోచరిస్తుంది. పూర్ణభక్తికి పూర్ణజ్ఞానానికి తేడా లేదు.

**- సాగిరాజు రామకృష్ణంరాజు, అర్ధవరం, సెల్ : 9491968966**